శనివారం
SATURDAY
3-10-2026
సంపుటి: 2 Volume:2 ‖ సంచిక: 96 Issue: 96
జగిత్యాల JAGITIAL ‖ పేజీలు:12 PAGES:12 ‖ వెల రూ.2.00 PRICE: 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play



# ‘బంగారు’ తల్లులు

## భారత మహిళల హాకీ జట్టుకు స్వర్ణం

### 44 ఏళ్ల నిరీక్షణకు తెర.. చైనాపై 1-0 తేడాతో విజయం

ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల హాకీ జట్టు చరిత్ర సృష్టించింది. ఏకంగా 44 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆసియాడ్‌లో స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. గిఫు ప్రిఫెక్చరల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచ 8వ ర్యాంకర్ అయిన భారత్, 4వ ర్యాంక్‌లో ఉన్న బలమైన చైనా జట్టును 1-0 తేడాతో మట్టికరిపించింది. ఈ అద్భుత విజయంతో 2028లో జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు భారత మహిళల జట్టు నేరుగా అర్హత సాధించి డబుల్ ధమాకా అందించింది.

టోక్యో: హై-వోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో భారత స్టార్ ప్లేయర్ లాల్‌రెమ్‌సియామి అదరగొట్టింది. మ్యాచ్ 10వ నిమిషంలోనే లాల్‌రెమ్‌సియామి ఓపెన్ ప్లే ద్వారా సాధించిన అద్భుతమైన గోల్ భారత్‌కు విజయాన్ని అందించింది. విశేషమేమిటంటే, లాల్‌రెమ్‌సియామికి భారత్ తరఫున ఇది సరిగ్గా 200వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి జట్టులో కీలక సభ్యురాలిగా మారిన ఈ స్టార్ ప్లేయర్, ఇప్పటివరకు ఆసియాడ్‌లో ఒక గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించి రికార్డు సృష్టించింది. భారత్‌కు ఆసియాడ్ చరిత్రలో మహిళల హాకీ విభాగంలో ఇది రెండో స్వర్ణం మాత్రమే. గతంలో 1982 ఢిల్లీ ఆసియాడ్‌లో భారత్ తొలిసారి గోల్డ్ గెలుచుకుంది. భారత పురుషుల హాకీ జట్టు కూడా స్వర్ణంపై కన్నేసింది. శుక్రవారం జరిగిన తరువాయి 2 వ పేజీలో...



## భారత్ స్వర్ణాల మోత

### పతకాల పట్టికలో టాప్-5లోకి భారత్

ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు స్వర్ణాల వేట కొనసాగిస్తున్నారు. ఆర్చరీ, బాక్సింగ్‌లో చారిత్రక విజయాలు నమోదు చేయడంతో భార త్ ఖాతాలో పసిడి పతకాల సంఖ్య 15కి చేరింది. తాజా విజయాలతో మొత్తం పతకాల సంఖ్య 75కు పెరిగింది. ఈరోజు జరిగిన మహిళల రికర్వ్ ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో భారత్ సంచలనం సృష్టించింది. అంకితా భకత్, కీర్తి, కుంకుమ్ మోహోద్‌లతో కూడిన భారత జట్టు, ఫైనల్లో పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ తరువాయి 2 వ పేజీలో...



## హనుమాన్ చాలీసా పఠించా

### దాడి సమయంలో అదే ధైర్యాన్నిచ్చింది

### మీరే నా ఆరాధ్య దైవం

### మోదీతో పైలట్ స్మిత్ మచ్చర్

న్యూఢిల్లీ: విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన షైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఆయన ధైర్యసాహసాలను -2 వ పేజీలో...

# ఆటో మినిమం రూ.30

## కనీస చార్జీ రూ.30గా నిర్ధారణ

### ఆ తర్వాత కిలోమీటరుకు రూ.14.. రాత్రి 11 తర్వాత ఒకటిన్నర రెట్లు అధికం

### భారీగా పెరిగిన ఆటో చార్జీలు.. రాష్ట్రంలో 12 ఏళ్ల తర్వాత పెంపు

తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా చార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ చార్జీలను సవరించడం గమనార్హం. నూతన చార్జీల ప్రకారం, కనీస చార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ చార్జీలను కూడా సవరించారు.

హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ చార్జీపై ఒకటి న్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ చార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త చార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త చార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో చార్జీలను సవరించారు. వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో-2 వ పేజీలో...





# ఏఐకి సుద్దబుద్ధులు

## హిందూ స్వామీజీని సంప్రదించిన ఆంథ్రోపిక్

### క్లాడ్ ఏఐ నైతిక శిక్షణ కోసం చర్చలు.. వెల్లడించిన స్వామి సర్వప్రియానంద

డల్లాస్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్న ప్రముఖ అమెరికన్ టెక్ సంస్థ ‘ఆంథ్రోపిక్’ ఒక ఆసక్తికరమైన నిర్ణయం తీసుకుంది. తమ ‘క్లాడ్’ ఏఐ మోడల్‌కు నైతిక విలువలు, మానవతా దృక్పథంపై శిక్షణ ఇచ్చేందుకు ఒక ప్రముఖ హిందూ స్వామీజీ సహాయాన్ని కోరింది. న్యూయార్క్‌లోని వేదాంత సొసైటీ అధిపతిగా ఉన్న స్వామి సర్వప్రియానందను తమ శాన్‌ఫ్రాన్సిస్కో ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించి, కీలక అంశాలపై చర్చించింది. ఈ ఏడాది జూన్‌లో డల్లాస్‌లోని ‘యూనిటీ ఆఫ్ డల్లాస్’ కార్యక్రమంలో ప్రసంగిస్తూ స్వామి సర్వప్రియానంద ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్ ఇటీవల ‘ఎక్స్’ (గతంలో ట్విట్టర్) సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తొలుత ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసిన ఆంథ్రోపిక్, ఆ తర్వాత ప్రయాణ, వసతి ఏర్పాట్లు చేసి తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,028 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,351 |

# జ్ఞానేశ్.. పక్కకు జరుగు!

### సీఈసీ రాజీనామా కోరుతూ జంతర్‌మంతర్ వద్ద ధర్నా

### న్యూఢిల్లీలో ఇంటర్నెట్ సస్పెండ్

న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మరింత ఆందోళన జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా జంతర్ మంతర్‌తోపాటు న్యూఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. ఎన్నికల నిర్వహణ, సర్ ప్రక్రియలో అవకతవకల విషయంలో చర్యలు తీసుకోవాలని, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తరువాయి 2 వ పేజీలో...



# డిసెంబర్ 9 నుంచి స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్

### సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు

### నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన తరువాయి 2 వ పేజీలో...



# నేనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే

### ఉప ఎన్నిక అవసరం లేదు

### కాంగ్రెస్ నేత విజయారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉపఎన్నిక జరుగుతుందా లేక 2023 ఎన్నికల వివాదంపై దాఖలైన పిటిషన్‌తోనే వ్యవహారం తేలుతుందా అనే ఉత్కంఠ వీడటం లేదు. మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికను తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రస్తుత హెచ్1బీ వ్యవస్థ పూర్తిగా లోపభూయిష్టంగా మారిందని, అవసరమైతే ఈ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయడానికి తాను మద్దతు ఇస్తానని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. ముఖ్యంగా.. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో, తక్కువ జీతాలకు విదేశీ ఉద్యోగులను నియమించేందుకు కొన్ని కంపెనీలు ఈ వీసా విధానాన్ని ఉపయోగిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# నడిరోడ్డుపై రక్తపు ధారలు

### మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు మృతి.. 21 మందికి గాయాలు



అమరావతి, అక్టోబర్ 2 (ఈవార్తలు): మహారాష్ట్రలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించగా, 21 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పికప్ వ్యాన్‌ను ట్రక్కు ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం, మహారాష్ట్ర, అమరావతి జిల్లా, ధామంగోన్ రైల్వే స్టేషన్ సమీపంలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై ఛానల్ 97 సమీపంలో జరిగింది. కొంతమంది భక్తులు ఒక పికప్ వ్యాన్‌లో నవరాత్రి వేడుకలు జరుపుకొనేందుకు ఒక ఆలయానికి బయల్దేరారు. బుల్దానా జిల్లాలోని షెగావోం నుంచి వార్ధాకు వెళ్తుండగా పికప్ వ్యాన్‌ను ఒక ట్రక్కు ఢీకొంది. ట్రక్కు తరువాయి 2 వ పేజీలో...

## విశాఖ బీచ్‌లో ముగ్గురు చిన్నారులు గల్లంతు

వైజాగ్, అక్టోబర్ 2 (ఈవార్తలు): ఏపీలోని విశాఖ జిల్లా రుషికొండ బీచ్ ఐటీ హిల్స్ వద్ద ముగ్గురు చిన్నారులు గల్లంత య్యారు. గాంధీ జయంతి సందర్భంగా సెలవు కారణంగా సమీపంలోని మదురవాడకు చెందిన 10 మంది బీచ్‌కు రాగా వీరిలో ముగ్గురు గల్లంతయినట్లు మిగతా చిన్నారులు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. లైఫ్‌గార్డు, మెరైన్ పోలీసుల సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. గల్లంతయిన వారి వివరాలను సేకరిస్తున్నారు.

# నేను ఆంధ్రా బిడ్డను

### అనంత్ అంబానీ



మదనపల్లె, అక్టోబర్ 2 (ఈవార్తలు): రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. “నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి” అంటూ చంద్రబాబును కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ‘ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్’ (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

3.10.2026

మేషం: పితృ వర్గీయులతో వివాదాలు కొంత చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో ప్రతిష్టంభన కలుగుతాయి. రెండు రకములైన ఆలోచనల వల్ల నష్టాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. బంధువులతో అకారణ వివాదాలు తప్పవు. కొన్ని వ్యవహారాలు దైవానుగ్రహంతో పూర్తి చేస్తారు.

వృషభం: ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. జీవిత భాగస్వామితో ఊహించని వివాదాలు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా వేస్తారు.

మిధునం: వ్యాపారాల్లో ఆశించిన విధంగా రాణిస్తారు. నూతన విషయాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఉద్యోగంలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఇంటా బయట అందరితో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. ఒక వ్యవహారంలో సన్నిహితులు సహాయ సహకారాలు అందుతాయి. చేపట్టిన పనులలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది.

సింహం: చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థికంగా మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. సంతానానికి నూతన విద్యా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

కన్య: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. బంధుమిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. బంధుమిత్రులు మీ మాటతో విభేదిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి. నూతన ప్రయత్నాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు.

తుల: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. కొన్ని విషయాలలో ఆత్మీయుల సహాయ సహకారాలు అందుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు.

వృశ్చికం: వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. నిరుద్యోగులకు ఒక వార్త సంతోషాన్నిస్తుంది. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

ధనస్సు: బంధువులతో వివాదాలు పరిష్కారమవుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు .కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

మకరం: దూరప్రయాణ సూచనలున్నవి. స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బంది కలిగిస్తుంది. నూతన ఋణప్రయత్నాలు కలసిరావు. చేపట్టిన పనులలో శ్రమపడ్డా ఫలితం కనిపించదు.

కుంభం: వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ముఖ్యమైన పనులు సమయానికి పూర్తిచేస్తారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. అందరిలోనూ గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి.

మీనం: వృత్తి ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహంతో పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. మొండి బకాయిలు వసూలవుతాయి.

# నేను ఆంధ్రా బిడ్డను



మొదటి పేజీ తరువాయి

విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది.

ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో చారిత్రక, జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్ టాగూర్ మదనపల్లెలోనే ఆంగ్లంలోకి అనువదించారని గుర్తుచేశారు. గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ నినాదాలను, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్', వాజ్‌పేయి 'జై విజ్ఞాన్', ప్రధాని మోదీ 'జై అనుసంధాన్' నినాదాలను ఉటంకిస్తూ.. ఈ నాలుగు నినాదాల కలయికతోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని వివరించారు. టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అనంత్ ప్రకటించారు. "ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తాం. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో చెప్పే వ్యవస్థను రూపొందిస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను 'ఊర్జాదాతలు' (శక్తి ప్రదాతలు)గా మారుస్తాం" అని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ. 1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# డిసెంబర్ 9 నుంచి స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్

మొదటి పేజీ తరువాయి

ఒప్పందాలు శుక్రవారం ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.



# జ్ఞానేశ్.. పక్కకు జరుగు!

మొదటి పేజీ తరువాయి

తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, యూత్ కాంగ్రెస్ నేతలు, ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టాలని నిర్ణయించారు. రాజ్యసభ ఎంపీ మనోజ్ ఝా, అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ తదితరులు ఈ నిరసనలో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఈ ఆందోళనలో సీజేపీ పాల్గొనడం లేదు. గతంలో సీజేపీ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళన ఎంత హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. అందుకే, ఈసారి ఆందోళనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. భారీ స్థాయిలో భద్రతా బలగాల్ని మోహరించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. జంతర్‌మంతర్ మార్గంలో ప్రయాణించే 11 మెట్రో రేల్వే స్టేషన్లను మూసివేశారు. జంతర్‌మంతర్‌కు దారితీసే అనేక మార్గాల్ని ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. పలు చోట్ల ట్రాఫిక్ మళ్లించారు. పదుల సంఖ్యలో ఆందోళనకారుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రాంతానికి వాహనాలు రాకపోవడంతో పలువురు ఆందోళనకారులు నడుచుకుంటూనే ఇక్కడికి చేరుకున్నారు.

### ఢిల్లీ డీసీపీ 'జనరల్ డయ్యర్': సీజేపీ చీఫ్

ఢిల్లీ ఘటనపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జులైలో ఢిల్లీలో సీజేపీ పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన ఘర్షణలు, పోలీసుల చర్యలతో పోలిస్తే ముంబయి పోలీసుల వైఖరి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. అంతేకాదు, ఢిల్లీ డీసీపీ సచిన్ శర్మను 'జనరల్ డయ్యర్'తో పోల్చుతూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర పోలీసులను చాలా మంచివారని అభివర్ణించిన దీప్కే.. ముంబయిలో తమకు ఎదురైన అనుభవాన్ని, జంతర్ మంతర్ నిరసనల సమయంలో ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును పోల్చి చూపుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "నన్ను అదుపులోకి తీసుకోవాలని ముంబయి పోలీసులకు ఉత్తర్వులు వచ్చాయి.. కానీ వారు ఎంత మంచివాళ్లంటే, నాకు టీ ఆఫర్ చేసి వెళ్లిపోమన్నారు. అదే ఢిల్లీలో అయితే డీసీపీ సచిన్ శర్మ ఒక క్రూరుడిలా (మోన్‌స్టర్) వ్యవహరిస్తారు.. డీసీపీ సచిన్ శర్మ అమిత్ షాకు 'జనరల్ డయ్యర్' లాంటివారు" అని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# ఆటో మినిమం రూ.30

మొదటి పేజీ తరువాయి

చార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ చార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.



# ఏఐకి సుద్దబుద్ధులు

మొదటి పేజీ తరువాయి

తమ కార్యాలయానికి పిలిపించిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ మతాలకు చెందిన వేదాంతవేత్తలు, కౌన్సెలర్లు, మానసిక ఆరోగ్య నిపుణులు కూడా పాల్గొన్నారని వివరించారు. ఏఐ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల తలెత్తే ప్రమాదాలు, నైతికపరమైన సవాళ్లపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు స్వామీజీ పేర్కొన్నారు. సంస్థకు చెందిన అత్యాధునిక ఏఐ ప్రగతిని కూడా తమకు చూపించారని, అయితే నాన్-డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ కారణంగా పూర్తి వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేశారు. ఏఐ అభివృద్ధిలో తీవ్రమైన పోటీ నెలకొందని, అందుకే బలమైన భద్రతా ప్రమాణాలు అత్యవసరమని ఆంత్రోపిక్ భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు, ఏఐపై అతిగా ఆధారపడటం, ఉద్యోగ నష్టాలు, సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం వంటి సామాజిక ప్రభావాలపై స్వామి సర్వప్రియానంద తన ఆందోళన వ్యక్తం చేశారు. వేదాంత మార్గంలో జ్ఞానం, ధ్యానం, భక్తి, సేవ ద్వారా ఆధ్యాత్మికంగా స్థిరంగా ఉండటమే ఇలాంటి సవాళ్లకు సమాధానమని ఆయన సూచించారు.

# భారత్ స్వర్ణాల మోత

మొదటి పేజీ తరువాయి

అయిన బలమైన దక్షిణ కొరియాను ఓడించి చరిత్రలో తొలిసారి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఇదే క్రీడలో రికర్వ్ మిక్స్‌డ్ టీమ్, పురుషుల రికర్వ్ జట్లు రజత పతకాలు గెలుచుకున్నాయి. బాక్సింగ్‌లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల 65 కేజీల విభాగంలో పర్వీన్ హుడా, 75 కేజీల విభాగంలో లవ్లీనా బోర్గోహైన్ స్వర్ణ పతకాలు సాధించారు. ఒకే ఏషియన్ గేమ్స్‌లో ఇద్దరు భారత మహిళా బాక్సర్లు స్వర్ణాలు గెలవడం ఇదే మొదటిసారి. మరోవైపు, రెజ్లింగ్‌లో సుజీత్ 65 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరుకోగా, పురుషుల సెపక్‌తక్రా క్వాడ్రంట్ జట్టు కాంస్యం గెలుచుకుంది. ప్రస్తుతం భారత్ 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలతో మొత్తం 75 పతకాలతో పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఈరోజు సాయంత్రం జరగనున్న మహిళల హాకీ ఫైనల్లో స్వర్ణ పతకం కోసం భారత జట్టు చైనాతో తలపడనుంది.

# హనుమాన్ చాలీసా పఠించా

మొదటి పేజీ తరువాయి

కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోదీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు. దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు. అనంతరం ప్రధాని మోదీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోదీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# నేనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి

సవాల్ చేస్తూ తాను దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక నిర్వహించకూడదని కాంగ్రెస్ నాయకురాలు, పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి కోరుతున్నారు. ఈ క్రమంలో ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని కోర్టు తేల్చితే.. ఖైరతాబాద్‌కు ప్రత్యేకంగా ఉపఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేకుండానే తనను ఎమ్మెల్యేగా ప్రకటించే అవకాశం ఉందని విజయారెడ్డి వ్యాఖ్యానించారు. తన ఎన్నికల పిటిషన్‌లో ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. తనకు న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉందని.. తన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు విజయారెడ్డి చెప్పారు. ఎన్నికల పిటిషన్‌పై తుది తీర్పు రాకముందే ఉపఎన్నిక నిర్వహించడంపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఆమె ప్రస్తావించారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున విజయారెడ్డి పోటీ చేశారు. ఆ తర్వాత దానం నాగేందర్‌పై విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తనతో పాటు తనపై ఆధారపడిన వారి ఆస్తుల వివరాలను దానం నాగేందర్ పూర్తిగా వెల్లడించలేదని.. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు పంపిణీ చేశారనే ఆరోపణలు కూడా విజయారెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దానం నాగేందర్ ఎన్నికను రద్దు చేసి.. తనను విజేతగా ప్రకటించాలని ఆమె కోర్టును కోరారు. 2024లో విజయారెడ్డి వేసిన ఈ ఎన్నికల పిటిషన్ విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. ఇదే సమయంలో పార్టీ ఫిరాయింపుల అంశానికి సంబంధించిన మరో కేసులో దానం నాగేందర్ ఎమ్మెల్యేగా కొనసాగడానికి అనర్హుడని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుపై సుప్రీంకోర్టులో ఆయనకు ఉపశమనం లభించకపోవడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు శాసనసభ కార్యదర్శి గెజిట్ జారీ చేశారు. అయితే దానం నాగేందర్‌పై వచ్చిన అనర్హత తీర్పు, విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ రెండు వేర్వేరు న్యాయపరమైన అంశాలు. ఒకటి పార్టీ ఫిరాయింపు నేపథ్యంలో ఎమ్మెల్యే పదవికి అనర్హతకు సంబంధించినది కాగా.. మరొకటి 2023లో జరిగిన ఎన్నికలో దానం నాగేందర్ గెలుపు చెల్లుబాటును సవాల్ చేస్తున్న పిటిషన్ కావడం ఆసక్తికరంగా మారింది. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ కావడంతో సాధారణంగా ఉపఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో తనను విజేతగా ప్రకటించాలని కూడా కోరిన నేపథ్యంలో ఈ అంశం మరోసారి న్యాయపరమైన చర్చకు దారితీసింది.

# 'బంగారు' తల్లులు

మొదటి పేజీ తరువాయి

సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 4-3తో ఓడించి ఫైనల్లోకి అడుగుపెట్టిన మెన్స్ ఇన్ బ్లూ, శనివారం జరగబోయే టైటిల్ ఫైట్‌లో మలేషియాతో తలపడనుంది. గత 2023 ఆసియాడ్‌లో జపాన్‌ను ఓడించి గోల్డ్ నెగ్గిన భారత పురుషుల జట్టు, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది.

# డూప్లికేట్ గాంధీ కుటుంబం

## వాళ్లది హిందూత్వ వ్యతిరేక అజెండా.. ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్.. కేంద్ర మంత్రి బండి సంజయ్

జమ్మికుంట, అక్టోబర్ 2 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.






## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# ప్రియుడే హంతకుడు

**హరిణి హత్య కేసులో వీడిన మిస్టరీ**

కొత్తగూడెం, అక్టోబర్ 2 (ఈవార్తలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంచలనం సృష్టించిన నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరిణి హత్య కేసులో మిస్టరీ వీడింది. ఆమెను ప్రేమించిన పవన్ కుమారే హంతకుడని పోలీసులు తేల్చారు. పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో పాటు, ఆమె మరో యువకుడితో సన్నిహితంగా ఉందనే అనుమానంతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి, పవన్ కుమార్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే, కుటుంబాల మధ్య పాత గొడవల కారణంగా వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. ఈ క్రమంలో పవన్ ప్రవర్తన సరిగా లేకపోవడం, చెడు అలవాట్లు ఉండటంతో హరిణి అతడిని దూరం పెట్టింది. దీంతో ఆమెపై పవన్ కక్ష పెంచుకున్నాడు. హరిణి మరో యువకుడితో ప్రేమలో ఉందని అనుమానించాడు. గత నెల 22న హరిణి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో పవన్ అక్కడికి వెళ్లాడు. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా, ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన పవన్, వెంట తెచ్చుకున్న బైక్ క్లచ్ వైర్‌తో ఆమె గొంతుకు బిగించి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంటి వెనుక మరుగుదొడ్డి వద్ద పడేసి పరారయ్యాడు. హరిణి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టారు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి విశాఖపట్నం, తిరుపతి పారిపోయిన పవన్, తిరిగి ఖమ్మం వచ్చాడు. తాను దాచిపెట్టిన బైక్ కోసం రాగా, అప్పటికే సెల్ ఫోన్ సిగ్నల్స్‌పై నిఘా పెట్టిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

# కామన్ పాస్ వచ్చేసింది

హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ నగరవాసులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ), హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) సంయుక్తంగా ఓ తీపికబురు అందించాయి. నగరంలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేస్తూ, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో 'కామన్ పాస్' విధానాన్ని శుక్రవారం ప్రారంభించాయి. ఈ కొత్త విధానం ద్వారా ప్రయాణికులు ఇకపై ఒకే పాస్‌తో ఆర్టీసీ బస్సుల్లో, మెట్రో రైళ్లలోనూ ప్రయాణించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం రోజూ లక్షలాది మంది నగరంలో ప్రయాణిస్తున్నారు. వీరిలో చాలామంది కొంత దూరం మెట్రోలో, మరికొంత దూరం బస్సులో ప్రయాణించాల్సి వస్తోంది. ఇలాంటి సందర్భాల్లో రెండు చోట్లా వేర్వేరుగా టికెట్లు లేదా పాసులు తీసుకోవడం సమయంతో పాటు కొంత అసౌకర్యంగా ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకే ఆర్టీసీ, మెట్రో అధికారులు ఈ ఉమ్మడి పాస్‌ను ప్రవేశపెట్టారు.

రోజువారీ పాస్: దీని ధరను రూ.400గా నిర్ణయించారు. ఇందులో మెట్రో ప్రయాణానికి రూ.300, ఆర్టీసీ బస్సుల ప్రయాణానికి రూ.100 కేటాయించారు. ఈ పాస్‌తో ఒక రోజంతా అపరిమితంగా మెట్రో, సిటీ బస్సుల్లో ప్రయాణించవచ్చు.

నెలవారీ పాస్: నెల రోజుల పాటు ప్రయాణించే వారి కోసం ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. దీని ధర రూ.8,500గా ఖరారు చేశారు. ఇందులో మెట్రో వాటా రూ.7,000 కాగా, ఆర్టీసీ వాటా రూ.1,500గా ఉంది. ఈ కామన్ పాస్ కార్డును మొదటిసారి తీసుకునేటప్పుడు రూ.100 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రయాణికులు కార్డును తిరిగి ఇచ్చినప్పుడు ఆ మొత్తాన్ని వెనక్కి ఇస్తారు. అయితే, ఈ పాస్‌పై ఓఆర్ఆర్ లోపల నడిచే పుష్పక్ ఏసీ బస్సులు మినహా మిగతా అన్ని ఆర్టీసీ సిటీ బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతి ఉంటుంది.

# 13 నాటికి అల్పపీడనం వాయుగుండంగా మారే చాన్స్

వైజాగ్, అక్టోబర్ 2 (ఈవార్తలు): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 - సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది.

# ట్రాన్స్‌కో వాటా అమ్మకం ఆపాలి

**రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ**



హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

# సంతోషిమాత విగ్రహంపై కర్రలతో దాడి

**హైదరాబాద్‌లో ఉద్రిక్తత.. నిందితుడి అరెస్టు**



హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# బీజేపీలో చేరిన స్వర్ణలత

హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు.

# రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

**బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్**

సంగారెడ్డి, అక్టోబర్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు. ఒకవేళ వారు స్పందించకపోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు.

# జాంబియాలో నల్లగొండ వాసి మృతి

నల్లగొండ, అక్టోబర్ 2 (ఈవార్తలు): నల్లగొండ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. ఉపాధి నిమిత్తం ఆఫ్రికా దేశమైన జాంబియాకు వెళ్లిన ఓ వ్యక్తి, బోరు బావి తవ్వుతుండగా జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ వార్త తెలియడంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన జనపాల లింగస్వామి (50) గత కొన్నేళ్లుగా జాంబియాలో బోర్-రిగ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే విధులకు వెళ్లిన అతడు, బోరు డ్రిల్లింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. లింగస్వామి మరణవార్తతో ఉరుమడ్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అతడికి ఇద్దరు కుమారులు కాగా, వారిలో ఒకరు గతేడాదే మృతి చెందాడు. ఇప్పుడు ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న లింగస్వామిని కూడా కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

# యువ డాక్టర్ అనుమానాస్పద మృతి

హైదరాబాద్, అక్టోబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఓ యువ వైద్యురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ఆదిత్య నగర్‌లోని ఓ ప్రైవేట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు (27) సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి. మహబూబ్‌నగర్‌లో వైద్య విద్యను అభ్యసించిన ఆమె, ఇటీవల వరంగల్‌లో పీడియాట్రిక్స్‌లో పీజీ పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం తన స్నేహితుడైన ఓ యువకుడితో కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఆమె, ఇక్కడ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో బస చేశారు. కుమార్తె ఫోన్ అందుబాటులోకి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, ఆమె మొబైల్ లొకేషన్‌ను ట్రేస్ చేశారు. అనంతరం శుక్రవారం మియాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు సర్వీస్ అపార్ట్‌మెంట్‌కు చేరుకుని పరిశీలించగా, అప్పటికే ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ

**మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మల, చంద్రబాబు**

**రాయలసీమ తలరాత మారుతుంది: పవన్ కల్యాణ్**

మదనపల్లె, అక్టోబర్ 2 (ఈవార్తలు): రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సర్ నోటీసులొచ్చినా ఆఫీసులకు రావొద్దు

**బీఎల్‌వోలే ఇంటి వద్దకు వచ్చి పత్రాలు తీసుకుంటారు: ఏపీ సీఈవో**

విజయవాడ, అక్టోబర్ 2 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్-2026)లో భాగంగా నోటీసులు అందుకున్నవారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్వో) కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్‌యాదవ్ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) స్వయంగా ఓటర్ల ఇళ్లకు వచ్చి అవసరమైన పత్రాలను సేకరిస్తారని ఆయన తెలిపారు. గురువారం జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో డిల్లీరావు కూడా పాల్గొన్నారు. ఓటర్ల నుంచి పత్రాలు తీసుకున్న తర్వాత బీఎల్‌వోలే వాటిని ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేస్తారని వివేక్ యాదవ్ వివరించారు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఆన్‌లైన్‌లో విచారణ ఉంటుందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అలాంటి కేసులు కేవలం 209 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకవేళ విచారణకు హాజరుకావాల్సి వస్తే, నోటీసులు అందుకున్న ఓటరు తన తరఫున 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యుడిని పంపవచ్చని సూచించారు. ఆన్‌లైన్ విచారణ సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. నగరాల్లోని నైట్‌షెల్టర్లలో నివసించేవారు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల ఓటు నమోదు కోసం అవసరాన్ని బట్టి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు, శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు. 'సర్' ప్రక్రియ కోసం ఫాం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తుచేశారు.



## గాంధీ బాటలో సాగాలి: జగిత్యాల ఎస్పీ

జగిత్యాల, అక్టోబర్ 2 (ఈవార్తలు): అహింసా మార్గంలో పోరాడి అఖండ భారతావనికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీజీ అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతి, అహింస, సత్యం మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. ఆయన నమ్మిన సిద్ధాంతాలను నిబద్ధతతో ఆచరించడం వల్లే గాంధీజీ కీర్తి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీఖాన్, ఆర్ఐలు వేణు, సైదులు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కేసీఆర్ పాలనే తెలంగాణకు రక్ష

జగిత్యాల, అక్టోబర్ 2 (ఈవార్తలు): తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జగిత్యాల తహసిల్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ 2014 అక్టోబర్ 2న రూ.51 వేల ఆర్థిక సాయంతో ప్రారంభమైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక భరోసా కల్పించారని అన్నారు. అనంతరం ఆ సాయాన్ని రూ.1,00,116కు పెంచినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆమె విమర్శించారు. రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం ఇచ్చిన మొత్తాన్ని కూడా సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. రూ.2,500 పథకానికి కూడా మంగళం పాడారని విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ బీఫామ్‌పై గెలిచి స్వలాభం కోసం పార్టీ మారారని దావ వసంత ఆరోపించారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆమె పేర్కొన్నారు.



## జల మహోత్సవంపై చర్చ

గంగాధర, అక్టోబర్ 2 (ఈవార్తలు): గాంధీ జయంతిని పురస్కరించుకుని గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కర్బూజ తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వీబీజీ రామ్‌జీ, జల మహోత్సవం, వ్యవసాయాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. 2026-27, 2027-28 సంవత్సరాలకు సంబంధించి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్థులకు వివరించారు. గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం, పనిదినాలు, వేతనాలు తదితర అంశాలపై చర్చించారు. జల సంరక్షణ, వ్యవసాయాభివృద్ధి, ఉపాధి కల్పనకు సంబంధించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సర్పంచ్ తెలిపారు. గ్రామస్థుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్త, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.వేములవాడలో



## ఉద్యమకారుల నిరసనకు బండి రమేష్ మద్దతు

కూకట్‌పల్లి, అక్టోబర్ 2 (ఈవార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ రోడ్ నంబర్-1లో తమకు కేటాయించాల్సిన స్థలాలు, ఇళ్ల కోసం ఉద్యమకారులు చేపట్టిన నిరసనకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకారులతో మాట్లాడిన ఆయన వారి సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ పోలీస్‌స్టేషన్ నిర్వహణ

వేములవాడ అర్బన్, అక్టోబర్ 2 (ఈవార్తలు): బీజేపీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు పట్టణ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో 'స్వచ్ఛ పోలీస్‌స్టేషన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం సేవలందించే పోలీసు సిబ్బంది పనిచేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం సామాజిక బాధ్యతగా భావించి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్, ముత్యం, నాయకులు కోల కృష్ణస్వామి, మల్లికార్జున్, రేగుల మల్లికార్జున్, బిల్ల కృష్ణ, మహంకాళి శీను, వివేక్‌రెడ్డి, మల్లేశం యాదవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ.. కబడ్డీ..

**వేములవాడలో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి పోటీలు**

**ప్రారంభించిన విప్ ఆది శ్రీనివాస్ తదితరులు**





వేములవాడ అర్బన్, అక్టోబర్ 2 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2 నుంచి 5వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తెలంగాణలోని 33 జిల్లాల నుంచి కబడ్డీ క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడాకారులు, అభిమానుల సందడితో క్రీడా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి. గీతే, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అతిథులుగా హాజరయ్యారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడా జెండాను ఆవిష్కరించారు. 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# స్వేరోస్ సిరిసిల్ల జిల్లా కమిటీ ఏర్పాటు




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 2 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి బొర్ర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. జిల్లా అధ్యక్షుడిగా బట్టు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మహేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా జింక శ్రీధర్, దోమకొండ సురేందర్, పల్లె నర్సింలు, కొత్తపల్లి ప్రభాకర్, కోశాధికారిగా బి. ప్రశాంత్, అధికార ప్రతినిధిగా మారుపాక హరీష్‌ను నియమించారు. సహాయ కార్యదర్శులుగా జె. నాగరాజు, ప్యాట రాజేష్, గుర్రాల రాజశేఖర్‌రెడ్డి, కుమ్మరి వేణు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మారంపల్లి రాజు, లక్కే సాగర్, బొల్లె జాషువాలను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా జింక గౌతమి, ఎర్రోళ్ల బాలకృష్ణలను నియమించగా, ప్రేరణ ఇన్‌చార్జిగా ఆకుల మహేష్ గౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా బొర్ర సురేష్ కుమార్ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే మూడు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని స్వేరోస్ నెట్‌వర్క్ విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కల్పిస్తోందన్నారు. యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, విద్యార్థులు, యువతకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించడం సంస్థ లక్ష్యమని తెలిపారు. యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్య ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు ఐక్యంగా పనిచేస్తూ స్వేరోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.



## బాల్య వివాహాలను అడ్డుకోవాలి

ధర్మపురి, అక్టోబర్ 2 (ఈవార్తలు): గాంధీ జయంతిని పురస్కరించుకుని వెల్గటూర్ మండలం తాళ్లకొత్తపేటలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ ద్యావనపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను గుర్తించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు, మహిళలు, యువత, ఉపాధి హామీ కూలీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వేములవాడలో ఘనంగా గాంధీ జయంతి



వేములవాడ అర్బన్, అక్టోబర్ 2 (ఈవార్తలు): వేములవాడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ గాంధీజీ పాటించిన సత్యం, అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ చేసిన త్యాగాలు, దేశ సేవ స్ఫూర్తిదాయకమన్నారు. సత్యం, అహింస, సత్యాగ్రహాన్ని ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారని పేర్కొన్నారు. యువత గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గంలో నడుస్తూ జాతి సమగ్రతను కాపాడుకోవాలని కోరారు. లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో ప్రజల్లో స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు. అటు.. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీనగర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి, శాస్త్రినగర్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ, కొండ్లెపు ముత్యం మాట్లాడుతూ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. వారి త్యాగాలు, సేవల ఫలితంగానే దేశ ప్రజలు స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. యువత వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, ఉపాధ్యక్షుడు కటుకం శ్రీనివాస్, కౌన్సిలర్లు మైలారం శ్రీనివాస్, వంగల శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్ మిలన్ సేవ'

జగిత్యాల, అక్టోబర్ 2 (ఈవార్తలు): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి పాల్గొని అంగన్‌వాడీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలతో మాట్లాడి కేంద్రంలోని వసతులు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ఇతర సేవల గురించి తెలుసుకున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని బోగ శ్రావణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మిషన్ సాక్షం అంగన్‌వాడీ-పోషణ్ 2.0' ద్వారా పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, ఆరోగ్య పరీక్షలు, టీకాలు తదితర సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, బద్ధం సుజాత, వట్టిమల్ల శ్రీనివాస్, ఏనుగు రవీందర్‌రెడ్డి, సుంకిసాల సత్యం, మైపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ నిరటి శ్రీనివాస్, కార్యదర్శి రాజేష్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## గాంధీకి ఘన నివాళి

కూకట్‌పల్లి, అక్టోబర్ 2 (ఈవార్తలు): ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, ఆల్విన్ కాలనీ ఫేజ్-2 ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సత్యాగ్రహాన్ని ఆయుధంగా, అహింసా మార్గాన్ని అనుసరించి గాంధీజీ కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు, కార్యాచరణను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సత్యం, అహింస గాంధీజీ సిద్ధాంతాలకు మూలాలని, సహాయ





# మహీంద్రా లక్ష ఈవీల అమ్మకం

**ఎక్స్ఈవీ 9ఎస్కు డిమాండ్**

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో మహీంద్రా అండ్ మహీంద్రా కీలక మైలురాయిని అందుకుంది. కంపెనీ బోర్న్ ఎలక్ట్రిక్ (బీఈ) శ్రేణి ఎస్‌యూవీల అమ్మకాలు లక్ష యూనిట్లు దాటాయి. కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ విషయాన్ని ‘ఎక్స్’లో వెల్లడించారు. మొదటి ఈవీ ఎస్‌యూవీలైన బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ బుకింగ్స్‌ను 2025 ఫిబ్రవరిలో ప్రారంభించిన తర్వాత రెండేళ్లు కూడా పూర్తికాకముందే ఈ స్థాయికి చేరడం విశేషం. బుకింగ్స్ తొలిరోజే మహీంద్రాకు 30,179 రిజర్వేషన్లు వచ్చాయి. వీటిన్నంటి ఎక్స్‌షోరూమ్ విలువ రూ.8,472 కోట్లుగా ఉంది. ఇందులో ఎక్స్ఈవీ 9ఈ వాటా 56 శాతం. అలాగే 73 శాతం మంది కస్టమర్లు టాప్ వేరియంట్ ప్యాక్ త్రీని ఎంచుకున్నారు. 2025 మార్చి 20న కస్టమర్ డెలివరీలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 9 నాటికి 3,000కుపైగా వాహనాలను అందించారు. నవంబర్ 2025 నాటికి బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ ఎస్‌యూవీలు 30 వేలకుపైగా భారత రోడ్లపైకి వచ్చాయి. అదే సమయంలో మరింత అందుబాటు ధరలో ఎక్స్ఈవీ 9ఎస్‌ను తీసుకొచ్చారు. దీని డెలివరీలు 2026 జనవరిలో ప్రారంభమయ్యాయి. 2026 ఏప్రిల్ చివరి నాటికి బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ, ఎక్స్ఈవీ 9ఎస్ కలిపి 65,615 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఇందులో ఎక్స్ఈవీ 9ఈ 34,369 యూనిట్లతో ముందుంది. బీఈ 6 20,108 యూనిట్లు, ఎక్స్ఈవీ 9ఎస్ 11,138 యూనిట్ల అమ్మకాలు సాధించాయి. ఆ తర్వాత కూడా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలకు డిమాండ్ కొనసాగింది. 2026 ఆగస్టులో ఎక్స్ఈవీ 9ఎస్ విక్రయాలు 4,508 యూనిట్లకు చేరాయి. ఈవీ అమ్మకాల జోరుతో మహీంద్రా మొత్తం ఎస్‌యూవీ విక్రయాలు కూడా పెరిగాయి. 2026 సెప్టెంబర్‌లో కంపెనీ మొత్తం ఆటో అమ్మకాలు 1,14,874 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ ఎస్‌యూవీ అమ్మకాలు 64,092 యూనిట్లకు చేరి 14 శాతం పెరిగాయి. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 1,83,397 యూనిట్లకు చేరి 26 శాతం వృద్ధి సాధించాయి.



# ఇన్‌స్టాగ్రామ్ అమ్మాయిల కోసమే: ఎలాన్ మస్క్

న్యూయార్క్: టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత, ఎక్స్ (గతంలో ట్విట్టర్) యజమాని ఎలాన్ మస్క్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ‘ఇన్‌స్టాగ్రామ్ అమ్మాయిల కోసం’ అంటూ ఆయన చేసిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో కొత్త చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే, గైగర్ క్యాపిటల్ అనే ఓ వెంచర్ క్యాపిటలిస్ట్ అక్టోబర్ 1న ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఒక పోస్ట్ చేశారు. ‘ఇన్‌స్టాగ్రామ్ ఒక మహిళా యాప్’ అని పేర్కొంటూ, దాన్ని తన ఫోన్ నుంచి తొలగించినట్లు తెలిపారు. దీనికి ఎలాన్ మస్క్ స్పందిస్తూ, “ఇన్‌స్టాగ్రామ్ అమ్మాయిల కోసమే” అని రిప్లై ఇచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది. అయితే, మస్క్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది మే నెలలో కూడా ఆయన ఇదే తరహాలో కామెంట్ చేసి వివాదానికి కారణమయ్యారు. అప్పట్లో, “కొంతమంది మగవాళ్లు తమ ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్స్ పంపినప్పుడు, మీరు లింగమార్పిడి చేసుకుంటున్నారా ఏంటి? అని అడగాలనిపిస్తుంది” అని కూడా వ్యాఖ్యానించి విమర్శల పాలయ్యారు. మస్క్ తాజా వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీన్ని హాస్యంగా తీసుకుంటుండగా, మరికొందరు జెండర్ స్టీరియోటైప్స్‌ను (లింగ పక్షపాతాన్ని) ప్రోత్సహించేలా ఉందని విమర్శిస్తున్నారు. వ్యాపారవేత్తలు, కళాకారులు, జర్నలిస్టులు ఇలా అన్ని వర్గాల వారు వాడుతున్న వేదికను ఇలా వర్గీకరించడం సరికాదని అంటున్నారు. ఎక్స్‌కు పోటీగా మెటా సంస్థ ‘థ్రెడ్స్’ను ప్రారంభించినప్పటి నుంచి ఈ రెండు సంస్థల మధ్య పోటీ తీవ్రమైన విషయం తెలిసిందే.



# మల్యాలలో స్వచ్ఛ ఆసుపత్రి కార్యక్రమం

మల్యాల, అక్టోబర్ 2 (ఈవార్తలు): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మల్యాల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ‘స్వచ్ఛ ఆసుపత్రి’ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రమైన ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేష్, నులుగొండ సురేష్, గుండేటి గంగారం, షేర్ల పరశురాం, జిల్లాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్ తోక వంకర



**హతమైన ఉగ్రవాదిపై సరికొత్త డ్రామా!**

న్యూఢిల్లీ: ఉగ్రవాదం విషయంలో తమది వంకర బుద్ధేనని పాకిస్థాన్ మరోసారి నిరూపించుకుంది. భారత భద్రతా దళాలు మట్టుబెట్టిన ఓ కీలక ఉగ్రవాది విషయంలో కొత్త నాటకానికి తెరలేపింది. తాము చంపేశామని భారత్ ప్రకటించిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్‌ను, “ఇదిగో బతికే ఉన్నాడు” అంటూ మీడియా ముందు ప్రవేశపెట్టి నవ్వులపాలైంది. అయితే, పాక్ ప్రదర్శించిన వ్యక్తికి, అసలు ఉగ్రవాదికి మధ్య తేడాలను నిపుణులు ఎత్తిచూపుతుండటంతో పాకిస్థాన్ ప్రచార ఎత్తుగడ బెడిసికొట్టింది. జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహ్మద్ ఆసిఫ్ అలియాస్ హాషీం మూసా అనే ఎల్ఈటీ కమాండర్‌ను హతమార్చినట్టు భారత సైన్యం ప్రకటించింది. ఇతను పాకిస్థాన్ ఆర్మీ స్పెషల్ సర్వీస్ గ్రూప్ మాజీ కమాండో. 2025లో 25 మంది పర్యాటకుల మరణానికి కారణమైన పెహల్గామ్ దాడి తర్వాత వైరల్ అయిన నలుగురు ఉగ్రవాదుల ఫొటోలో మిగిలిన చివరివాడు ఇతడే. అత్యంత కఠినమైన శిక్షణ పొందిన మూసా, పీర్ పంజాల్ ప్రాంతం, కశ్మీర్ లోయలో అనేక దాడులకు సూత్రధారి. ఒకప్పుడు పాక్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ భద్రతా బృందంలోనూ పనిచేశాడు. ఇంతటి కీలక ఉగ్రవాదిని మట్టుబెట్టడం భారత సైన్యానికి పెద్ద విజయం. భారత్ సాధించిన ఈ విజయాన్ని జీర్ణించుకోలేని పాకిస్థాన్, గురువారం తమ ఆర్మీ అధికార ప్రతినిధి (డీజీ ఐఎస్‌పీఆర్) లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధరితో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టించింది. అందులో ఓ వ్యక్తిని కూర్చోబెట్టి, అతనే మహ్మద్ ఆసిఫ్ అని పరిచయం చేసింది. ఆ వ్యక్తి కూడా తాను పాక్ సైన్యంలో 18 ఏళ్లు పనిచేసి 2023లో హవల్దార్‌గా రిటైర్ అయ్యానని, “నేను బతికే ఉన్నాను, మీ ముందే ఉన్నాను” అని చెప్పాడు.

# కెప్టెన్ స్మిత్‌కు ఇజ్రాయెల్ కృతజ్ఞత

**ముంబైలో భారీ హోర్డింగులు ఏర్పాటు**

**కోలుకున్నాక అధికారికంగా సత్కరిస్తామన్న ఇజ్రాయెల్**

ముంబై: విమానంలో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను కొనియాడుతూ ఇజ్రాయెల్ ప్రభుత్వం ముంబైలో భారీ హోర్డింగులను ఏర్పాటు చేసింది. ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, అతను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ముంబైలోని ఇజ్రాయెల్ కాన్సులేట్ జనరల్ ఈ ప్రచారాన్ని ప్రారంభించింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సహ పైలట్, కెప్టెన్ స్మిత్‌పై కత్తితో దాడి చేసి విమానాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించాడు. మెడ, చేతులపై తీవ్ర గాయాలైనప్పటికీ, స్మిత్ ధైర్యంగా వ్యవహరించి ఎమర్జెన్సీ అలర్ట్ బటన్ నొక్కి కాక్‌పిట్ డోర్ తెరిచారు. దీంతో ప్రయాణికులు, విమానంలో ఉన్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు కలిసి సహ పైలట్‌ను అడ్డుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఆ విమానంలో 27 మంది చిన్నారులతో సహా అత్యధికులు ఇజ్రాయెల్ పౌరులే ఉన్నారు. ఈ నేపథ్యంలో, ముంబైలోని పలు ప్రధాన ప్రాంతాల్లో “థ్యాంక్యూ, కెప్టెన్ స్మిత్, ఇజ్రాయెల్ పౌరుల ప్రాణాలు కాపాడినందుకు ధన్యవాదాలు. మీరు త్వరగా కోలుకోవాలి” అనే సందేశంతో ఈ హోర్డింగులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ యానివ్ రెవాచ్ మాట్లాడుతూ.. స్మిత్ భారత్, ఇజ్రాయెల్ రెండింటికీ హీరో అని కొనియాడారు. స్మిత్ పూర్తిగా కోలుకోవడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆయనను అధికారికంగా సత్కరిస్తుందని తెలిపారు. ప్రస్తుతం కెప్టెన్ స్మిత్ తబుక్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. దాడికి పాల్పడిన సహ పైలట్‌ను అరెస్ట్ చేసి యూఏఈకి తరలించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. భారత ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వంటి పలువురు నేతలు ఇప్పటికే స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు.




# రెండు సార్లు విషమిచ్చినా బతికింది

**టెన్నెస్సీలో మహిళా ఖైదీకి విఫలమైన మరణశిక్ష**

న్యూయార్క్: అమెరికాలోని టెన్నెస్సీలో ఒక అరుదైన, విస్మయపరిచే ఘటన చోటుచేసుకుంది. మరణశిక్ష పడిన క్రిస్టా పైక్ (50) అనే మహిళా ఖైదీకి రెండుసార్లు లెథాల్ ఇంజెక్షన్ (విషపు ఇంజెక్షన్) ఇచ్చినా ఆమె ప్రాణాలతో బయటపడింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతుండగా, ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, 1995లో కోలీన్ స్లెమ్మర్ అనే 19 ఏళ్ల యువతిని దారుణంగా హత్య చేసిన కేసులో క్రిస్టా పైక్‌కు 1996లో మరణశిక్ష విధించారు. బుధవారం ఈ శిక్షను అమలు చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. దాదాపు గంటపాటు శ్రమించి, ఏడుసార్లు సూదులు గుచ్చిన తర్వాత ఆమె చేతికి ఐవీ లైన్ ఏర్పాటు చేశారు. అనంతరం, ప్రొటోకాల్ ప్రకారం పెంటబార్బిటాల్ అనే మందును రెండు డోసులుగా ఆమెకు ఎక్కించారు. అయితే, మందు ఇచ్చిన తర్వాత కూడా ఆమె శ్వాస తీసుకోవడం, గట్టిగా గురక పెట్టడం గమనించారు. దీంతో అధికారులు వెంటనే శిక్షను నిలిపివేసి, ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెన్నెస్సీ గవర్నర్ బిల్ లీ తీవ్రంగా స్పందించారు. మరణశిక్ష అమలులో జరిగిన వైఫల్యంపై స్వతంత్ర దర్యాప్తుకు ఆదేశించారు. అంతేకాకుండా, ఈ ఏడాది రాష్ట్రంలో జరగాల్సిన అన్ని మరణశిక్షలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో డిసెంబర్ 3న జరగాల్సిన మరో ఖైదీ ఉరిశిక్ష కూడా వాయిదా పడింది. దాదాపు 500 మరణశిక్షలను ప్రత్యక్షంగా చూసిన ప్రముఖ జర్నలిస్ట్ మైఖేల్ గ్రాజిక్ ఈ ఘటనపై స్పందిస్తూ, ఇది అపూర్వమని వ్యాఖ్యానించారు. విషపు మందును ఎక్కించిన తర్వాత కూడా ఖైదీ బతికి ఉండటం తన సుదీర్ఘ అనుభవంలో ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. అమెరికాలో 1982 నుంచి 64 మరణశిక్షలు విఫలం కాగా, వాటిలో 51 లెథాల్ ఇంజెక్షన్ల ద్వారా జరిగినవే. అయితే, మందు ఎక్కించాక ఖైదీ ప్రాణాలతో ఉండటం అత్యంత అరుదు. ప్రస్తుతం క్రిస్టా పైక్ కోలుకున్న తర్వాత ఆమె శిక్షను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈ ఘటనతో అమెరికాలో మరణశిక్ష అమలు పద్ధతులపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.



# మోదీ యుద్ధం వద్దంటున్నారు: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. మోదీకి పరస్పర అంగీకారంతో సమస్య పరిష్కరించేలా చాలా మంచి ఆలోచనలు ఉన్నాయని చెప్పారు. భారత్, రష్యా మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ.. ఉక్రెయిన్ వివాదానికి ముగింపు పలకాలని మోదీ ప్రతిసారి తనతో ప్రస్తావిస్తారని పుతిన్ తెలిపారు. మాస్కోలో గురువారం జరిగిన వాల్దాయ్ డిస్కషన్ క్లబ్ సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదాన్ని ముగించే అంశాన్ని మోదీ ప్రతి సమావేశంలోనూ లేవనెత్తుతారని చెప్పారు. శాంతియుత పరిష్కారం కోసం మోదీకి ఆసక్తి ఉందని, సమస్యకు ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ఆయన మంచి సూచనలు ఇస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో మోదీ తటస్థ వైఖరిని కొనసాగిస్తున్నారని పుతిన్ అన్నారు. అదే సమయంలో యుద్ధానికి ముగింపు రావాలన్న ఆసక్తిని స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో మోదీ చేస్తున్న ప్రయత్నాలకు రష్యా కృతజ్ఞతలు చెబుతోందని పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, పుతిన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఘర్షణలకు పరిష్కారం చూపేందుకు చర్చలు, దౌత్య మార్గమే ముందుకు వెళ్లే దారి అని మోదీ మరోసారి స్పష్టం చేశారు. శాంతి ప్రయత్నాలకు భారత్ సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. అప్పటి నుంచి మోదీ పలుమార్లు యుద్ధానికి ముగింపు పలకాలని, చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.





# బ్రిడ్జిపై వందే భారత్ 100 కిమీ వేగం

**చీనాబ్, అంజీ బ్రిడ్జిలపై వేగంతో పయనం**

**విజయవంతంగా ట్రయల్ రన్ పూర్తి**

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లో భారతీయ రైల్వే మరో చారిత్రక మైలురాయిని అధిగమించింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన అయిన చీనాబ్ బ్రిడ్జితో పాటు, దేశంలోని మొట్టమొదటి కేబుల్ ఆధారిత అంజీ వంతెనపై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తొలిసారిగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. కత్రా-బనిహాల్ సెక్షన్‌లో నిర్వహించిన ఈ ట్రయల్ రన్ విజయవంతమైంది. ఉత్తర రైల్వే పరిధిలోని 111 కిలోమీటర్ల పొడవైన కత్రా-బనిహాల్ మార్గంలో గరిష్ఠ వేగ పరిమితిని గంటకు 75 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్లకు పెంచారు. ఈ నేపథ్యంలో వందే భారత్ రైలు (నం. 26401/26404) తో నిర్వహించిన ట్రయల్ రన్‌లో రైలు ఈ రెండు కీలక వంతెనలపై గంటకు 100 కి.మీ. వేగాన్ని నమోదు చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఉచిత్ సింఘాల్ ధ్రువీకరించారు. కశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ (యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్టులో కత్రా-బనిహాల్ సెక్షన్ అత్యంత కీలకమైనది. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ట్రయల్ రన్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ, “భారత ఇంజినీరింగ్ అద్భుతం.. గంటకు 100 కిలోమీటర్ల వేగం” అని వ్యాఖ్యానించారు. రైల్వే మంత్రిత్వ శాఖ గత ఆగస్టులోనే భద్రతా నిబంధనలను సమీక్షించి, వేగాన్ని పెంచడానికి అనుమతులు మంజూరు చేసింది. పెరిగిన వేగం వల్ల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రయాణికులకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు.




# సీజేపీ వర్సెస్ జెన్ నెక్స్ట్

**ముంబైలో పోటాపోటీ నిరసనలు**

ముంబై: ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా ‘జెన్ నెక్స్ట్ ముంబై’ బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్స్ట్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, “అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం” అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్స్ట్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను ‘దిమాగీ నక్సల్స్’గా అభివర్ణించగా, జెన్ నెక్స్ట్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

# ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక జ్ఞానం: మోహన్ భగవత్

న్యూఢిల్లీ: భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, “మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి” అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. “ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది” అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. “ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు” అని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. “మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు” అని భగవత్ ఉద్ఘాటించారు.



లవ్లీ చిత్రం



సారా టెండుల్కర్



## సితార.. పక్కా తెలంగాణ మాస్

సూపర్ స్టార్ మహేష్ బాబు గారాల పట్టి సితార ఘట్టమనేని ఎప్పుడూ సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గానే ఉంటుంది. డ్యాన్స్ వీడియోలు, వెకేషన్ వ్లాగ్స్ తో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫాలోయింగ్ క్రియేట్ చేసుకున్న ఈ స్టార్ కిడ్, లేటెస్ట్ గా ఒక డిఫరెంట్ యాంగిల్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఫాహద్ ఫాసిల్ డోంట్ ట్రబుల్ ద ట్రబుల్ సినిమా కోసం ఆమె చేసిన ప్రమోషనల్ వీడియో ఇప్పుడు నెట్టింట మాస్ వైబ్స్ క్రియేట్ చేస్తోంది. మొన్నటి వరకు సితార ఎక్కువగా ఇంగ్లీష్ లోనే మాట్లాడేది. తెలుగు కూడా అక్కడక్కడా అలా టచ్ చేస్తూ వెళ్లేది. సాధారణంగా చిన్నప్పటి నుంచి వరల్డ్ స్కూల్స్, ఇంగ్లీష్ వాతావరణంలో పెరగడం వల్ల స్టార్ కిడ్స్ భాషా శైలి అలానే ఉంటుంది. సితార కూడా ఆ ఇంటర్నేషనల్ కల్చర్ లోనే ఎక్కువగా కనిపిస్తూ వచ్చేది. భాష మీద పట్టు ఉన్నా, క్యాజువల్ కన్వర్జేషన్స్ అన్నీ ఇంగ్లీష్ లోనే సాగేవి. కానీ ఇప్పుడు ఆ లెక్కలన్నీ మారిపోయాయి. ఊహించని విధంగా సితార మాటల్లో మాస్ తెలంగాణ వైబ్స్ ఉట్టి పడుతున్నాయి. ఏమాత్రం కృతిమత్వం లేకుండా, పక్కా లోకల్ యాసలో ఆమె చెప్పిన డైలాగ్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.



## రణబాలి.. స్వాతంత్ర్య పోరాటం!

మాతృభూమి కోసం పోరాడిన కొందరు రాయలసీమ చారిత్రక వీరుల స్ఫూర్తితో రణబాలి పాత్రను క్రియేట్ చేసినట్లు దర్శకుడు రాహుల్ సంకృత్యన్ తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ మాట్లాడుతూ.. 'ఎందరో వీరులను కన్న గడ్డ రాయలసీమ. బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి వంటి సీమ పాలెగాళ్ల వీరగాథలు ఇప్పటికీ బుర్రకథలుగా చెప్పుకుంటారు. రాయలసీమ గ్రామాలకు వెళ్తే అక్కడి ప్రజలు వీరి గొప్పదనం గురించి మాట్లాడుతుంటారు. గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి గురించి విన్నప్పుడు నాకు ఈ కథ ఆలోచన కలిగింది. ఆయన గుర్రం స్వారీ చేస్తూ వెళ్లేవారు. దేవుళ్లతోనూ మాట్లాడుతారని ప్రతీతి. అనంతరం కుట్రలు చేసి ఆయనను హత్య చేశారు. అప్పటి కరువు కాలం గురించి పరిశోధన చేస్తున్నప్పుడు బుడ్డా వెంగళరెడ్డి గురించి తెలుసుకున్నాను. కరువు కాలంలో ఆయన తన ఆస్తులన్నీ అమ్మి గంజి కేంద్రాలను ఏర్పాటు చేసిన వేలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి వారికి సింహస్వప్నంలా నిలిచారు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. నేను రాయలసీమ గడ్డ నుంచి వచ్చినవాడినే. ప్రజలకు మంచి చేసేందుకు ఇలా ధీరత్వం ప్రదర్శించే ఎంతోమందిని నా చిన్నతనంలో చూశాను. ఈ వీరులంతా మంచి శరీర ధారుడ్యంతో ధైర్య సాహసాలు ప్రదర్శించేవారు. వారందరినీ స్ఫూర్తిగా తీసుకుని రణబాలి పాత్రను డిజైన్ చేసుకున్నాను' అని చెప్పుకొచ్చాడు.

## అక్షర హాసన్ ఫెయిల్



విశ్వ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా కోలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన అక్షర హాసన్ కెరీర్ ఎలా సాగుతుందో చెప్పాల్సిన పనిలేదు. షమితాబ్ తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు ఆ తర్వాత మరో నాలుగైదు సినిమాలు చేసింది గానీ... అనుకున్న విధంగా సక్సెస్ అవ్వలేదు. అలాగని పరిశ్రమకు దూరం కాలేదు. ఇప్పటికీ యాక్టివ్ గానే సినిమాలు చేస్తుంది. కానీ తనను తాను ఇంకా నిరూపించుకోలేదు. నటించిన సినిమాల్లో తనదైన ఐడెంటిటీ వేయలేకపోతుంది. ప్రస్తుతం ఓ రెండు మూడు సినిమాల్లో నటిస్తోన్న అక్షర హాసన్ వ్యక్తిగత జీవితం –కెరీర్ ప్రయాణానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తాను హైస్కూల్ చదువును మధ్యలోనే ఆపేసినట్లు అమ్మడు ఓపెన్ అయింది. పాఠశాల రోజుల్లో మూడుసార్లు ఫెయిల్ అయ్యానని నిర్మొహమాటంగా వెల్లడించారు. ఆ సమయంలో చదువుపై పూర్తిగా ఆసక్తి కోల్పోయానని..ఇక పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేననే విషయాన్ని గ్రహించి హైస్కూల్ నుంచే బయటకు వచ్చేశానని తెలిపారు.

## వందకు రెండొందల శాతం

'వారణాసి' సినిమాలో మహేష్‌బాబు నటనపై చిత్ర దర్శకుడు రాజమౌళి ప్రశంసలు కురిపించారు. సినిమా ఆరంభానికి ముందు మహేష్‌బాబు నుంచి ఉత్తమ నటన రాబట్టుకోవాలనే ఆలోచన ఉండేదని, అయితే సెట్‌లోకి ఎంటరయ్యాక అత్యుత్తమ ప్రదర్శనతో తనను ఆశ్చర్యపరిచారని రాజమౌళి కొనియాడారు. 'వారణాసి' సినిమాలో మహేష్‌బాబు నటనపై చిత్ర దర్శకుడు రాజమౌళి ప్రశంసలు కురిపించారు. సినిమా ఆరంభానికి ముందు మహేష్‌బాబు నుంచి ఉత్తమ నటన రాబట్టుకోవాలనే ఆలోచన ఉండేదని, అయితే సెట్‌లోకి ఎంటరయ్యాక అత్యుత్తమ ప్రదర్శనతో తనను ఆశ్చర్యపరిచారని రాజమౌళి కొనియాడారు. 'రుద్ర' పాత్రలో మహేష్‌బాబు చూపిస్తున్న అంకితభావం అంచనాలను మించిపోయిందని, తాను 100శాతం ఆశిస్తే మహేష్‌బాబు ఏకంగా 200శాతం ఇచ్చాడని రాజమౌళి కితాబిచ్చారు.





## 'తులా భారం' రవితేజ ..

'ఇరుముడి'తో ఇటీవలే బ్లాక్‌బస్టర్ హిట్‌ను దక్కించుకున్నారు హీరో రవితేజ. ఈ విజయోత్సాహంలో ఆయన తదుపరి ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి చేసిన వివేక్ ఆత్రేయ త్వరలో చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'తులా భారం' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. దసరాకు ఈ సినిమాను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.



## శ్రీనిధి కెరీర్ గాడిలో పడేనా..!

కన్నడ సౌందర్యరాశి శ్రీనిధి శెట్టి కెరీర్ తొలి నుంచి ఎంతో ఆసక్తికరంగా సాగుతోంది. పాన్-ఇండియా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేజీఎఫ్ ఫ్రాంచైజీతో వెండితెరకు పరిచయమైన అమ్మడు తొలి చిత్రంతోనే వెయ్యి కోట్ల క్లబ్ హీరోయిన్‌గా నిలిచారు. అటుపై విక్రమ్ సరసన కోబ్రా, నేచురల్ స్టార్ నానితో హిట్-3 వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించినా? ఆశించిన స్థాయిలో అవకాశాలను అందుకోలేకపోయారు. భారీ హిట్లు ఖాతాలో ఉన్నా? అవకాశాల విషయంలో మాత్రం స్పీడ్ పెంచలేకపోయిన శ్రీనిధి కెరీర్‌కు ఇప్పుడు ఓ కీలకమైన పరీక్ష ఎదురవుతోంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఆదర్శ కుటుంబం చిత్రంపై శ్రీనిధి భారీ ఆశలే పెట్టుకున్నారు. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో అమ్మడు వెంకటేష్ సరసన 'స్వర్ణ' అనే గృహిణిగా, తల్లి పాత్రలో కనిపిస్తుంది. గ్లామరస్ రోల్స్ .. పాటలకే పరిమితమయ్యే క్యారెక్టర్లకు భిన్నంగా మధ్యతరగతి కుటుంబంలోని భార్యగా, బాధ్యతాయుతమైన తల్లిగా అమ్మడు ఈ చిత్రంలో డీగ్లామరైజ్డ్ అండ్ పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్ పోషిస్తున్నారు.



## రాశి ఖన్నా మంచి మనసు

ఒకవైపు సినిమాలు , మరొకవైపు ఈవెంట్లు అంటూ రాశి ఖన్నా సందడి చేస్తోంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకొని డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా సీజన్ 13 లాంచ్ ఈవెంట్ లో పాల్గొన్న ఈమె ఆరోగ్యం , పరిశుభ్రతపై తన అభిప్రాయాలను పంచుకుంది. ముఖ్యంగా తనకు పరిశుభ్రత పాటించే అలవాటు తన తల్లి ద్వారా వారసత్వంగా వచ్చింది అంటూ రాశి ఖన్నా చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. "ఆరోగ్యం అనేది మనం ఉండే ఇల్లు.. అలాగే మన చుట్టూ ఉండే పర్యావరణంతో ముడిపడి ఉంటుంది. సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి సోషల్ మీడియా ఒక గొప్ప సాధనం.. ఒక చిన్న పోస్ట్ ద్వారా లక్షలాది మందికి అవగాహన కల్పించవచ్చు' అంటూ తన అభిప్రాయంగా పంచుకుంది రాశి ఖన్నా.

# 2023 ఓటమి మరిచిపోలేదు: గిల్

2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఇంకా వెంటాడుతూనే ఉంది. 2027 ప్రపంచకప్‌లో ఆ లోటును పూడ్చుకోవాలని గిల్ భావిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ తమకు ఎంతో ప్రత్యేకమని చెప్పిన అతడు.. దేశం తరఫున ప్రపంచకప్ ఆడే అవకాశం ప్రతిసారీ రాదని పేర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్ 2న ప్రారంభం కానుంది. నవంబర్ 21న ఫైనల్ జరుగుతుంది. భారత్ తన తొలి మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. 2023 ప్రపంచకప్ ఫైనల్లో అహ్మదాబాద్‌లో ఆస్ట్రేలియా చేతిలోనే భారత్ ఓడిన విషయం తెలిసిందే. "2023 ప్రపంచకప్‌లో మేం చాలా బాగా ఆడాం. టోర్నీ మొత్తం చూస్తే మేమే అత్యుత్తమ జట్టులా కనిపించాం. కానీ ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ సరిగ్గా ఆడకపోయినా ఫలితం మారిపోతుంది. ఆ మ్యాచ్ ఫైనల్ అయితే మరింత బాగా ఉంటుంది. అందుకే 2027 ప్రపంచకప్‌ను మేం పూర్తి చేయాల్సిన పనిగా చూస్తున్నాం" అని గిల్ చెప్పాడు. దేశం తరఫున ప్రపంచకప్‌లో ఆడే అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయని గిల్ అన్నాడు. "కెరీర్‌లో ఎన్ని ప్రపంచకప్‌లు ఆడగలమో చెప్పలేం. అందుకే దేశం తరఫున ప్రపంచకప్‌లో ఆడే ప్రతి అవకాశం ప్రత్యేకమే. మరోసారి ఈ అవకాశం దక్కడం ఆనందంగా ఉంది" అని గిల్ పేర్కొన్నాడు. కెప్టెన్సీపై కూడా గిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్‌కు కెప్టెన్ కావాలనేది చిన్నప్పటి తన కల కాదని, దేశం తరఫున ఆడుతూ మ్యాచ్‌లు గెలిపించాలన్నదే తన కోరిక అని చెప్పాడు. ఇప్పుడు కెప్టెన్సీ బాధ్యత రావడంతో దాన్ని గౌరవంగా స్వీకరించానని తెలిపాడు. వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు విజయమే తనకు ముఖ్యమని గిల్ స్పష్టం చేశాడు. వన్డేల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచినప్పుడు సంతోషంగా అనిపించిందని, అయితే ఇప్పుడు ర్యాంకింగ్స్‌పై పెద్దగా దృష్టి పెట్టడం లేదని చెప్పాడు. మైదానంలోకి దిగిన ప్రతిసారీ జట్టును గెలిపించేందుకు తనవంతు కృషి చేయడమే తన లక్ష్యమని వెల్లడించాడు.

## భారత్-పాక్ ఫైనల్‌కు నఖ్వీ దూరం

భారత్-పాకిస్థాన్ మధ్య ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ స్వర్ణ పతక మ్యాచ్ వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఈ మ్యాచ్‌కు హాజరు కావడం లేదు. గతంలో ఆసియా కప్ భారత్ గెలిచినప్పుడు నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకోకపోవడం, ఇటీవల భారత మహిళల జట్టు కూడా ఇదే విధంగా వ్యవహరించడంతో.. ఈసారి ఏషియన్ గేమ్స్ ఫైనల్ తర్వాత ఏం జరుగుతుందన్న ఆసక్తి నెలకొంది. 2025 పురుషుల టీ20 ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించింది. ఫైనల్‌లోనూ విజయం సాధించిన భారత జట్టు.. నఖ్వీ నుంచి ట్రోఫీ స్వీకరించలేదు. ఇటీవల జరిగిన మహిళల టీ20 ఆసియా కప్ ఫైనల్‌లో శ్రీలంకను ఓడించిన భారత మహిళల జట్టు కూడా నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకోలేదు. ఆసియా క్రీడల్లో గెలిస్తే మళ్లీ నఖ్వీ చేతుల మీదుగా భారత్ స్వర్ణ పతకాలు తీసుకోవాల్సి వస్తుందన్న విశ్లేషణలు వెలువడ్డాయి. దీంతో భారత్ పతకాలు స్వీకరిస్తుందా? లేదా? అనే ఆసక్తి వ్యక్తమైంది. కానీ, ఆయనే స్వయంగా రాననడంతో ఉత్కంఠకు తెరపడింది. ముందుగా ఖరారైన కార్యక్రమాలు ఉండటంతో నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగే ఫైనల్స్ డేకు నఖ్వీ రాలేకపోతున్నట్లు ఏసీసీ వెల్లడించింది. భారత్, పాకిస్థాన్‌తో పాటు.. కాంస్య పతకం కోసం ఆడనున్న బంగ్లాదేశ్, శ్రీలంకకు కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నఖ్వీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ గానే కాకుండా, ఆ దేశ కేంద్ర ప్రభుత్వంలో అంతర్గత వ్యవహారాల మంత్రిగానూ ఉన్నారు. సెమీఫైనల్లో పాకిస్థాన్ ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించారు. మరో సెమీఫైనల్లో భారత్ 124 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. దీంతో స్వర్ణ పతకం కోసం భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. 2025లో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరిగాయి. ఆ తర్వాత ఇరు దేశాల క్రికెట్ మ్యాచ్ లలో కరచాలనాలకు దూరంగా ఉన్న సందర్భాలు కనిపించాయి. దీంతో ఆసియా క్రీడల ఫైనల్లోనూ మ్యాచ్ అనంతరం ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య సంప్రదాయ కరచాలనం ఉంటుందా అన్నదానిపై ఆసక్తి నెలకొంది.

## 2027 ప్రపంచకప్‌కు పాండ్యా కీలకం: గంగూలీ



2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలకమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. అతడిని పూర్తిగా ఫిట్‌గా ఉంచి, ప్రపంచకప్‌కు సిద్ధం చేయడం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ముందున్న ప్రధాన సవాల్ అని పేర్కొన్నాడు. 2027 ప్రపంచకప్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనుంది. పాండ్యా ఇప్పటికే 2019, 2023 ప్రపంచకప్‌ల్లో భారత్ తరఫున ఆడాడు. 2023లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయం కావడంతో టోర్నీకి దూరమయ్యాడు. "ప్రపంచకప్‌లో భారత జట్టు సమతూకానికి హార్దిక్ చాలా ముఖ్యం. అతడిని మైదానంలో ఫిట్‌గా ఉంచడం గంభీర్, టీమ్ ముందున్న పెద్ద సవాల్. అతడు తగినంత క్రికెట్ ఆడటం లేదు. ఒకవేళ హార్దిక్ అందుబాటులో లేకపోతే నితీశ్ రెడ్డి తర్వాతి ప్రత్యామ్నాయం. కానీ నితీశ్‌ను హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా చూడాలంటే అప్పటివరకు అతడు వరుసగా క్రికెట్ ఆడాలి" అని గంగూలీ జియోస్టార్‌తో అన్నాడు. రవీంద్ర జడేజా కూడా మరో ప్రత్యామ్నాయమని గంగూలీ పేర్కొన్నాడు.



# కుర్రాళ్ల అద్భుత పోరాటం

## ఆస్ట్రేలియా ఏతో భారత్-ఏ డ్రా.. 1-0 తేడాతో సిరీస్‌ను భారత్ కైవసం

భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. చివరి రోజు అసాధారణ పోరాటపటిమ కనబరిచిన యశ్ రాథోడ్, షామ్స్ ములానీ గట్టి పట్టుదలతో క్రీజులో నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఏ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో 162 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో సిరీస్ విజేతగా నిలిచింది. శుక్రవారం, నాలుగో రోజు ఆటలో 365 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఏ, ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. విజయానికి 55 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, ఆసీస్ బౌలర్ల నిరంతర దాడిని తట్టుకుని ఓటమిని తప్పించుకోవడంలో సఫలమైంది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన తుషార్ దేశ్‌పాండే (52), యశ్ రాథోడ్ (80) హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర పోషించగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన షామ్స్ ములానీ (131 బంతుల్లో 26) అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కాపాడాడు. నాలుగో రోజు ఆట ప్రారంభంలోనే భారత్ ఏ పై ఒత్తిడి పెరిగింది. అయితే నైట్‌వాచ్‌మన్ తుషార్ దేశ్‌పాండే సుమారు 180 నిమిషాల పాటు క్రీజులో నిలబడి ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (26)తో కలిసి 60 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే లంచ్ తర్వాత ఆసీస్ బౌలర్ లియామ్ స్కాట్ (5/52) తన పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వైవిధ్యభరిత బౌన్స్‌తో ఇబ్బంది పెడుతూ పడిక్కల్, దేశ్‌పాండేలతో పాటు తొలి మ్యాచ్ సెంచరీ హీరో కుమార్ కుశాగ్రను కూడా పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ ఏ 199 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో యశ్ రాథోడ్, షామ్స్ ములానీ జతకలిశారు. ఓటమి అంచున ఉన్న జట్టును గట్టెక్కించడానికి వీరోచితంగా పోరాడారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 131 బంతులు ఎదుర్కొని 85 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్న దశలో లియామ్ స్కాట్ మళ్లీ చెలరేగాడు. మొదట రాథోడ్‌ను, ఆ తర్వాత ములానీని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి ఉత్కంఠను తారాస్థాయికి చేర్చాడు. చివరి మూడు ఓవర్లు మిగిలి ఉండగా భారత్ చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. అన్షుల్ కంబోజ్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ప్రఫుల్ హింగేతో కలిసి నచికేత్ భూతే (20 నాటౌట్) చివరి ఓవర్లను జాగ్రత్తగా ఆడి మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. దీంతో భారత్ ఏ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి.




## నేడు బ్రెజిల్ వర్సెస్ భారత్

**కోల్‌కతా సాల్ట్ లేక్ స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు మ్యాచ్**

భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్‌తో భారత సీనియర్ పురుషుల జట్టు రేపు చరిత్రాత్మక స్నేహపూర్వక మ్యాచ్‌లో తలపడనుంది. కోల్‌కతాలోని ప్రఖ్యాత సాల్ట్ లేక్ స్టేడియం వేదికగా శనివారం (అక్టోబరు 3) రాత్రి 7:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత సీనియర్ జట్టు, బ్రెజిల్ సీనియర్ జట్టు ముఖాముఖిగా పోటీపడటం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఫిఫా ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టిన తర్వాత భారత జట్టు ఎదుర్కోబోతున్న అత్యంత బలమైన జట్టు ఇదే. ప్రస్తుతం బ్రెజిల్ 5వ ర్యాంకులో ఉండగా, భారత్ 138వ స్థానంలో ఉంది. గతంలో 1995లో 9వ ర్యాంకర్‌గా ఉన్న రష్యా, 1998లో అదే ర్యాంకులో ఉన్న జపాన్‌లతో భారత్ తలపడింది. ఇప్పుడు అంతకంటే బలమైన బ్రెజిల్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమైంది. ఇటీవల 44వ ర్యాంకులో ఉన్న పనామాతో జరిగిన మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకోవడం భారత జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది. ఆ మ్యాచ్‌లో రాయన్ విలియమ్స్ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత్, పటిష్ఠమైన రక్షణతో బలమైన ప్రత్యర్థిని నిలువరించింది. మరోవైపు, 2026 ప్రపంచకప్‌లో నార్వే చేతిలో ఓటమి తర్వాత బ్రెజిల్ జట్టు ఓటమి ఎరుగకుండా ముందుకు సాగుతోంది. కోచ్ కార్లో అన్‌సెలొట్టి శిక్షణలో ఇప్పటివరకు 19 మ్యాచ్‌లు ఆడి 11 విజయాలు సాధించింది. అయితే, తొడ కండరాల గాయం కారణంగా ఆ జట్టు స్టార్ ఆటగాడు రాఫిన్హా ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. భారత ఫుట్‌బాల్‌కు, బ్రెజిల్‌కు మధ్య అనుబంధం ఎప్పటినుంచో ఉంది. 1977లో ఫుట్‌బాల్ దిగ్గజం పీలే కోల్‌కతాలో మోహన్ బగాన్‌తో ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడాడు. ఇప్పుడు బ్రెజిల్ సీనియర్ జట్టు తొలిసారిగా భారత్‌లో అడుగుపెడుతోంది.

## భారత హాకీ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్న భారత హాకీ అంపైర్, టెక్నికల్ అధికారి గుర్విందర్ సింగ్ సంఘాను టోర్నీ మధ్యలోనే స్వదేశానికి పంపించారు. ఆయనపై లైంగిక వేధింపుల ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రీడల కోసం ఆసియా హాకీ ఫెడరేషన్ (ఏహెచ్ఎఫ్) సంఘాను అంపైర్ మేనేజర్‌గా నియమించింది. అయితే, మలేషియాకు చెందిన ఒక మహిళా హాకీ అధికారి ఆయనపై లైంగిక వేధింపుల ఫిర్యాదు చేశారు. శిక్షణ (మెంటరింగ్) పేరుతో సంఘా తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అసభ్యంగా తాకారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనితో పాటు, అంపైర్లు బస చేసిన హోటల్ సిబ్బందితోనూ ఆయన దురుసుగా ప్రవర్తించినట్లు మరో ఫిర్యాదు అందింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 30వ తేదీనే సంఘా నగోయా నుంచి వెనుదిరిగాడు. ఈ ఉదంతంపై హాకీ ఇండియా స్పందిస్తూ, "ఏహెచ్ఎఫ్ నుంచి ప్రతికూల నివేదిక అందిన పక్షంలో అతనిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. అతను దోషిగా తేలితే విడిచిపెట్టే ప్రసక్తే లేదు" అని హాకీ ఇండియా అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. 54 ఏళ్ల గుర్విందర్ సింగ్‌పై గతంలోనూ ఇటువంటి ఆరోపణలు రావడం గమనార్హం. 2025లో రాంచీలో జరిగిన హాకీ ఇండియా లీగ్ సందర్భంగా ఒక మహిళా అంపైర్ ఆయనపై ఫిర్యాదు చేశారు.





## రెడ్ బాల్ క్రికెట్‌కు చాహల్ గుడ్‌బై!

భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తన క్రికెట్ కెరీర్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి వైదొలగుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. భారత్ తరఫున టెస్ట్ క్యాప్ ధరించాలన్న తన చిరకాల స్వప్నం ఇక నెరవేరే అవకాశం లేదని గ్రహించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపాడు. అయితే, వన్డే, టీ20 ఫార్మాట్లలో తన ప్రస్థానం కొనసాగుతుందని స్పష్టం చేశాడు. 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించినా, టెస్టుల్లో ఆడే అవకాశం మాత్రం చాహల్‌కు దక్కలేదు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చాహల్ ఒక భావోద్వేగ పోస్ట్ చేశాడు. "నేను మొదటిసారి పట్టుకున్నది రెడ్ బాల్. అప్పుడు నా వయసు 10 ఏళ్లు. ఈ ఆటతో ఇంత ప్రేమలో పడతానని అప్పుడు నాకు తెలియదు. రెడ్ బాల్ క్రికెట్ నాకు కేవలం ఒక ఫార్మాట్ మాత్రమే కాదు. ఓపిక, పట్టుదల, దృఢ సంకల్పం అంటే ఏమిటో అక్కడే నేర్చుకున్నా. ప్రతి వికెట్, ప్రతి పరుగు కోసం గంటల తరబడి పోరాడటంలోని ఆనందాన్ని అనుభవించాను" అని పేర్కొన్నాడు. "నా చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లార్డ్స్‌లో ఆడాను. టెస్ట్ క్యాప్ ధరించడం నా కల. ఎన్నో ఏళ్లుగా ఆ కలను మోశాను. అది నెరవేరకపోయినా, ఈ ఫార్మాట్‌లో నాకు లభించిన ప్రతి అవకాశానికి నేను

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 3-10-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

## ఎవరి కోసం ఈ పోరాటం?

రాజకీయాల్లో తరాల మార్పు సహజం. ఒక తరం నిర్మించిన వ్యవస్థను మరో తరం ప్రశ్నిస్తుంది. పాత తరం అనుభవాన్ని ముందుకు తెస్తే.. కొత్త తరం మార్పును కోరుతుంది. ఈ రెండు ధోరణుల మధ్య భేదాభిప్రాయాలు ఉండటం సహజమే. కానీ ఆ పోరాటం చివరకు ఎవరి ప్రయోజనాలకు దారితీస్తుందన్నదే అసలు ప్రశ్న. సీజేపీ వర్సెస్ జెన్ నెక్స్‌గా కనిపిస్తున్న ఈ వైరుధ్యంలో సామాన్యుడి ఆలోచన మాత్రం చాలా సూటిగా ఉంది.. తమకు కావాల్సింది ఎవరు గెలిచారన్నది కాదు.. తమ బతుకులు ఎప్పుడు మెరుగుపడతాయన్నదే. తరాలు మారుతున్నాయి. సాంకేతికత మారుతోంది. జీవన విధానం మారుతోంది. ఉద్యోగాల స్వరూపం మారుతోంది. సమాచారాన్ని తెలుసుకునే వేగం పెరిగింది. ప్రశ్నించే స్వభావం పెరిగింది. ఒకప్పుడు నాయకుడు చెప్పిందే వార్తగా, నిర్ణయంగా భావించిన ప్రజలు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. ఇచ్చిన హామీ ఏమైంది? చేసిన పని ఎంత? ఖర్చు ఎంత? ఫలితం ఏమిటి? అని లెక్కలు అడుగుతున్నారు. ఇదే కొత్త తరంలో కనిపిస్తున్న ప్రధాన మార్పు. అయితే పాత తరం మొత్తాన్ని కొట్టిపారేయడం కూడా సరైనది కాదు. ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొన్న అనుభవం, వ్యవస్థలపై అవగాహన, సామాజిక సంబంధాల పట్ల పరిజ్ఞానం పాత తరానికి ఉంది. అదే సమయంలో కొత్త తరాన్ని కేవలం అనుభవం లేదన్న కారణంతో పక్కన పెట్టడం కూడా సమంజసం కాదు. కొత్త తరం వద్ద ప్రశ్నించే ధైర్యం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం ఉంది. ప్రపంచాన్ని దగ్గరగా చూసే అవకాశం ఉంది. తమ హక్కుల గురించి తెలుసుకునే ఆసక్తి ఉంది. అసలు సమస్య ఈ రెండు తరాల మధ్య ఎవరు పైచేయి సాధిస్తారన్నది కాదు. రెండు తరాల బలాలను సమాజం కోసం ఎలా ఉపయోగించాలన్నదే. సామాన్యుడి జీవితంలో మాత్రం ఈ తరం పోరాటాలకంటే వేరే సమస్యలు పెద్దవిగా ఉన్నాయి. ధరల పెరుగుదల, ఉపాధి కొరత, విద్యా వ్యయం, వైద్య ఖర్చులు, రైతుల సమస్యలు, చిన్న వ్యాపారుల ఇబ్బందులు, పట్టణాల్లో రవాణా–మౌలిక వసతుల సమస్యలు.. ఇవే అతడి రోజువారీ ప్రశ్నలు. రాజకీయాల్లో ఎవరు ఎవరిని ఓడించారు అనే చర్చ కంటే, తన ఇంటి ఖర్చులు ఎలా తగ్గుతాయి? తన పిల్లలకు మంచి విద్య ఎలా అందుతుంది? ఉద్యోగం ఎక్కడ లభిస్తుంది? వైద్యం ఎందుకు ఖరీదవుతోంది? అనే ప్రశ్నలే అతడిని వెంటాడుతున్నాయి. కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటే స్వాగతించాల్సిందే. కానీ కొత్తదనం అంటే కేవలం కొత్త ముఖాలు కాదు. కొత్త ఆలోచన, కొత్త బాధ్యత, కొత్త పారదర్శకత, కొత్త జవాబుదారీతనం రావాలి. అదే విధంగా పాత తరం అనుభవం అంటే కేవలం గత విజయాల జాబితా కాదు. ఆ అనుభవం నేటి సమస్యలకు పరిష్కారం చూపగలగాలి. ప్రజాస్వామ్యంలో తరాల మధ్య పోటీ కంటే ఆలోచనల మధ్య పోటీ అవసరం. ఎవరి వయసు ఎంత? ఎవరు ఎప్పటి నుంచి రాజకీయాల్లో ఉన్నారు? ఎవరి వెనుక ఎంత బలం ఉంది? అన్నదానికంటే ఎవరి విధానాలు ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయన్నదే చర్చ కావాలి. సామాన్యుడు ఇక కేవలం ప్రేక్షకుడు కాదు. అతడు ప్రశ్నించే పౌరుడు. సామాజిక మాధ్యమాల్లో స్పందించే వ్యక్తి మాత్రమే కాదు.. తన ఓటు విలువను అర్థం చేసుకుంటున్న పౌరుడు. అందుకే పాత తరం అయినా, జెన్ నెక్స్ట్ అయినా ప్రజల ముందు ఒకే పరీక్ష ఎదుర్కోవాల్సిందే.. మాటలు కాదు, మార్పు ఏమిటి? హామీలు కాదు, అమలు ఎంత? ప్రచారం కాదు, ప్రజలకు ప్రయోజనం ఎంత? సీజేపీ వర్సెస్ జెన్ నెక్స్ట్ అనే పోరు చివరకు రాజకీయ వర్గాల మధ్య పోరుగా మిగిలిపోతే సామాన్యుడికి ఒరిగేదేమీ ఉండదు. అది అనుభవం వర్సెస్ ఆలోచనగా కాకుండా అనుభవం.. ఆలోచనగా మారినప్పుడే సమాజానికి ప్రయోజనం. పాత తరానికి ఉన్న అనుభవం.. కొత్త తరానికి ఉన్న ఉత్సాహం.. రెండూ ప్రజా ప్రయోజనంతో కలిసినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ఎవరు గెలిచారన్నది చరిత్రలో ఒక పంక్తి కావచ్చు. కానీ ప్రజలు గెలిచారా? వారి జీవితాల్లో మార్పు వచ్చిందా? వారి సమస్యలకు పరిష్కారం దొరికిందా? అన్నదే అసలైన చరిత్ర. తరాలు మారాలి.. రాజకీయ ఆలోచనలు మారాలి.. కానీ రాజకీయాల కేంద్రబిందువుగా ఉండాల్సింది మాత్రం సామాన్యుడే.

# ప్రపంచానికి ముప్పేట దెబ్బ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఒక్క సమస్య కుదిపేస్తే దాని నుంచి బయటపడేందుకు ఒక పరిష్కారం వెతకవచ్చు. కానీ ఒకేసారి ఇంధన ధరలు మండిపోవడం.. అప్పులపై వడ్డీ భారం పెరగడం.. ప్రకృతి వైపరీత్యాల ముప్పు తీవ్రమవడం మొదలైతే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుంది. ప్రస్తుతం ప్రపంచం ఇలాంటి ముప్పేట సవాలునే ఎదుర్కొంటోంది. ఒకవైపు చమురు, ఇంధన సరఫరా అంతరాయాలు ధరలను పైకి నెడుతున్నాయి. మరోవైపు అధిక వడ్డీ రేట్లు ప్రభుత్వాలు, సంస్థలు, కుటుంబాల రుణభారాన్ని పెంచుతున్నాయి. దీనికి తోడు బలపడుతున్న ఎల్ నినో వాతావరణ పరిస్థితులు వ్యవసాయం, ఆహార సరఫరా, నీటి వనరులు, ఆరోగ్యం వంటి రంగాలపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇది కేవలం ఆర్థిక నిపుణుల చర్చకు పరిమితమైన విషయం కాదు. పెట్రోలు ధర పెరిగితే రవాణా ఖర్చు పెరుగుతుంది.



**శశిధర్ అక్కెల**

రవాణా ఖర్చు పెరిగితే కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అనేక వస్తువుల ధరలు ప్రభావితమవుతాయి. వడ్డీ రేట్లు ఎక్కువైతే గృహ, విద్య, వ్యాపార రుణాలపై భారం పెరుగుతుంది. వాతావరణం ప్రతికూలిస్తే పంట దిగుబడులు దెబ్బతిని ఆహార ధరలు పెరగవచ్చు. అంటే మూడు దెబ్బలూ చివరకు సామాన్యుడి ఆదాయం–ఖర్చుల మధ్య అంతరాన్ని పెంచేవే.

ఇంధన ధరల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రపంచ దేశాలు ఒకే విధానాన్ని అనుసరించడం లేదు. కొన్ని దేశాలు ఇంధన పన్నులను తగ్గిస్తున్నాయి. మరికొన్ని ఇంధన సబ్సిడీలను పెంచుతున్నాయి. కొన్ని దేశాలు ప్రజలను తక్కువ ఇంధనం వినియోగించాలని కోరుతూ పొదుపు చర్యలు చేపడుతున్నాయి. మరికొన్ని ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. జూన్ 2026 నాటికి 113 దేశాలు ఇంధన ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు కనీసం ఒక విధానపరమైన చర్య తీసుకున్నట్లు అంతర్జాతీయ ఇంధన సంస్థ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక అత్యవసర నిల్వలు కూడా కీలక ఆయుధంగా మారాయి. అంతర్జాతీయ ఇంధన సంస్థ సమన్వయంతో మార్చిలో 40 కోట్ల బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలను మార్కెట్‌కు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించగా, తాజాగా జీ7 దేశాలు మరో 10 కోట్ల బ్యారెళ్ల చమురు, డీజిల్ నిల్వలను విడుదల చేయాలని ప్రకటించాయి. అయితే నిల్వల విడుదల తాత్కాలిక ఉపశమనమే. అసలు పరిష్కారం చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం. అందుకే పునరుత్పాదక ఇంధనం, అణుఇంధనం, విద్యుత్ ఆధారిత రవాణా, ఇంధన సామర్థ్యం పెంపు వంటి దీర్ఘకాలిక చర్యలపై అనేక దేశాలు దృష్టి పెడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో పునరుత్పాదక లేదా అణు విద్యుత్ విస్తరణకు విధానాలు అమల్లో ఉన్నాయని ఐఈఏ చెబుతోంది.

ఇంధన ధరల పెరుగుదల వెంటనే కనిపిస్తుంది. కానీ అధిక వడ్డీ రేట్ల ప్రభావం క్రమంగా బయటపడుతుంది. ప్రభుత్వం అప్పు తీసుకుంటే వడ్డీ చెల్లించాలి. కంపెనీలు అధిక వడ్డీకి అప్పు తీసుకుంటే పెట్టుబడులు, ఉద్యోగాలపై ప్రభావం పడవచ్చు. కుటుంబాలు రుణాలు తీసుకుంటే నెలవారీ వాయిదాలు పెరుగుతాయి. ఈ మొత్తం భారం చివరకు ఆర్థిక వ్యవస్థలో వినియోగాన్ని తగ్గించే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ప్రకారం 2025లో ప్రపంచ ప్రభుత్వ రుణం ప్రపంచ జీడీపీలో దాదాపు 94 శాతానికి చేరింది. అధిక రుణభారం, పెరిగిన రుణ వ్యయాలు ప్రభుత్వాల ఆర్థిక వెసులుబాటును తగ్గిస్తున్నాయని సంస్థ హెచ్చరిస్తోంది. అల్పాదాయ దేశాల్లో వడ్డీ చెల్లింపులు సగటున పన్ను ఆదాయంలో 21 శాతం వరకు మింగేస్తున్నాయి. ఇక్కడ మరో ప్రమాదం ఉంది. వాతావరణ విపత్తు వచ్చినప్పుడు ప్రభుత్వాలకు సహాయక చర్యలు చేపట్టేందుకు అదనపు నిధులు అవసరం. కానీ అప్పటికే రుణభారం ఎక్కువగా ఉంటే కొత్తగా అప్పు తీసుకోవడం ఖరీదవుతుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి పరిశోధన ప్రకారం ప్రకృతి విపత్తులు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వ దేశీయ రుణ వ్యయాలను పెంచే అవకాశం ఉంది. అంటే వాతావరణ సంక్షోభం ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయగలదు.

ఇప్పటికే ఆహారం, ఇంధనం ధరలతో సతమతమవుతున్న ప్రపంచానికి ఎల్ నినో మరో సవాలు. ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకారం 2026లో ఎల్ నినో బలపడుతోంది. ఆగస్టు–అక్టోబర్ కాలంలో ఇది ప్రపంచ వాతావరణ నమూనాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుతుందని అంచనా. సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో కరువు ముప్పు పెరగవచ్చని సంస్థ హెచ్చరిస్తోంది. ఇక్కడ కూడా దేశాల ముందున్న మార్గం ఒక్కటే.. ముందస్తు సిద్ధత. వాతావరణ అంచనాలను రైతులకు వేగంగా అందించడం, నీటి నిల్వలను పెంచడం, కరువు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, విత్తన నిల్వలు సిద్ధం చేయడం, ఆహార ధాన్యాల నిల్వలను బలోపేతం చేయడం, విపత్తు నిర్వహణ వ్యవస్థలను అప్రమత్తం చేయడం వంటి చర్యలు అవసరం. ఎల్ నినోను ఆపడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు.



కానీ దాని ప్రభావాన్ని తగ్గించడానికి ముందుగానే సిద్ధపడటం మాత్రం సాధ్యమే. ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ముందస్తు హెచ్చరికలు, వాతావరణ సమాచార ఆధారిత నిర్ణయాలు, వ్యవసాయం–ఆరోగ్యం–నీటి రంగాల్లో ముందస్తు ప్రణాళికల అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

ఇంధన ధరలను ఒక్క దేశం నియంత్రించలేదు. అంతర్జాతీయ వడ్డీ పరిస్థితులను ఒక్క ప్రభుత్వం మార్చలేదు. ఎల్ నినోను ఏ దేశమూ సరిహద్దుల్లో ఆపలేదు. కాబట్టి ఈ మూడు సమస్యలకు జాతీయ చర్యలతో పాటు అంతర్జాతీయ సహకారం కూడా అవసరం. ఇంధన విషయంలో వ్యూహాత్మక నిల్వలు, సరఫరా మార్గాల వైవిధ్యం, ప్రత్యామ్నాయ ఇంధనాల విస్తరణ అవసరం. అప్పుల విషయంలో రుణ పునర్వ్యవస్థీకరణ, తక్కువ వ్యయంతో అభివృద్ధి నిధులు, బాధ్యతాయుత రుణ నిర్వహణ అవసరం. వాతావరణ రంగంలో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, వాతావరణ బీమా, విపత్తు నిధులు, సాంకేతిక సహకారం అవసరం. అయితే ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డబ్బు ఎక్కడి నుంచి తేవాలన్నదే. ఇంధన ధరలను తగ్గించేందుకు సబ్సిడీలు ఇస్తే ఖజానాపై భారం. వడ్డీ భారం తగ్గించేందుకు ఖర్చులు తగ్గిస్తే సంక్షేమ కార్యక్రమాలపై ప్రభావం. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారీగా ఖర్చు చేస్తే అప్పులు పెరిగే అవకాశం. అందుకే ప్రతి దేశం లక్షిత, తాత్కాలిక, ఆర్థికంగా నిలదొక్కుకునే చర్యలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రపంచ దేశాలు సంక్షోభం వచ్చిన ప్రతిసారీ తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టడం సరిపోదు. ఇంధన ధరలు పెరిగినప్పుడు సబ్సిడీ ఇవ్వడం ఒక పరిష్కారం కావచ్చు. కానీ పదే పదే అదే పరిస్థితి వస్తే చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థను మార్చాల్సిందే. వడ్డీ రేట్లు పెరిగినప్పుడు రుణభారం తగ్గించడం అవసరం. కానీ దీర్ఘకాలంలో ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ, ఉత్పాదక పెట్టుబడులు, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టాలి. ఎల్ నినో వచ్చినప్పుడు సహాయం చేయడం అవసరం. కానీ అంతకంటే ముందే వ్యవసాయాన్ని వాతావరణ మార్పులకు తట్టుకునేలా మార్చాలి. సామాన్యుడికి కావాల్సింది ప్రతి సంక్షోభం తర్వాత ప్రకటించే పరిహారం కాదు. సంక్షోభం వచ్చినా తన జీవితం ఒక్కసారిగా తలకిందులు కాకుండా ఉండే వ్యవస్థ. ఇంధన భద్రత లేకపోతే ధరల షాక్ తప్పదు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే వడ్డీ భారం తప్పదు. వాతావరణ సిద్ధత లేకపోతే ఎల్ నినో దెబ్బ తప్పదు. అందుకే ప్రపంచ దేశాలకు ఇప్పుడు ఒక స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సిన సమయం ఇది.. చమురు కోసం అత్యవసర నిల్వలు ఎంత అవసరమో.. ఆహారం కోసం నిల్వలు కూడా అంతే అవసరం. ఆర్థిక సంక్షోభాలకు నిధులు ఎంత అవసరమో.. వాతావరణ విపత్తులకు ముందస్తు నిధులు కూడా అంతే అవసరం. మూడు సంక్షోభాలు వేర్వేరు రూపాల్లో కనిపిస్తున్నా వాటి ప్రభావం ఒకే చోట కలుస్తోంది.. సామాన్యుడి జీవితం వద్ద. అక్కడే ప్రభుత్వాలకు అసలు పరీక్ష.



# అదిగో పల్లె పూల సోయగం

బతుకమ్మ పండుగ వచ్చిందంటే తెలంగాణ పల్లెలు, పట్టణాలు పూల సోయగంతో మురిసిపోతాయి. ఆడపడుచుల సందడి, రంగురంగుల పూల అలంకరణలు, చప్పట్ల మధ్య మార్మోగే బతుకమ్మ పాటలు.. ఇవన్నీ కలిసే తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపును తెస్తాయి. పండుగ రోజులలో బతుకమ్మ ఆటలకు వేళ కాగా.. జానపద గేయాలకు మరోసారి డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు పెద్దల నోట, పల్లెవీధుల్లో సహజంగా వినిపించిన పాటలు ఇప్పుడు కొత్త తరానికి కూడా చేరువ కావడం సాంస్కృతికంగా ఆశాజనక పరిణామం.

బతుకమ్మ పాట అనేది కేవలం పండుగలో పాడే గేయం కాదు. తెలంగాణ ప్రజల జీవన విధానం, ప్రకృతితో అనుబంధం, కుటుంబ బంధాలు, ఆడపడుచుల భావోద్వేగాలు, గ్రామీణ జీవన చిత్రణ.. ఇలా ఎన్నో అంశాలను తనలో ఇముడ్చుకున్న జానపద కళారూపం. తరతరాలుగా ఒకరి నుంచి మరొకరికి మౌఖికంగా చేరిన ఈ పాటల్లో చరిత్ర కూడా ఉంది, సంస్కృతి కూడా ఉంది, స్థానిక భాషా మాధుర్యం కూడా ఉంది. అయితే కాలానుగుణంగా బతుకమ్మ పాటల రూపం మారుతోంది. ఒకప్పుడు డప్పులు, చప్పట్లు, గొంతులే ప్రధాన వాయిద్యాలైతే.. ఇప్పుడు సంగీత పరికరాలు, ఆధునిక రికార్డింగ్ పద్ధతులు, సామాజిక మాధ్యమాలు వాటికి కొత్త వేదికలుగా మారాయి. కొత్త పాటలు పుట్టుకొస్తున్నాయి. పాత పాటలకు కొత్త బాణీలు అద్దుతున్నారు. యువత కూడా వాటిని ఆసక్తిగా వింటోంది. దీనివల్ల జానపద గేయాలకు మార్కెట్ పెరుగుతోంది. ఇది ఒకవైపు సంతోషించాల్సిన పరిణామమే అయినా.. మరోవైపు కొన్ని ప్రశ్నలను కూడా ముందుకు తెస్తోంది. ప్రజాదరణ కోసం అసలు జానపద సాహిత్యంలోని భావాన్ని మార్చడం, పదాలను వక్రీకరించడం, సంప్రదాయానికి సంబంధం లేని అంశాలను జోడించడం జరుగుతోందా? వేగంగా మారుతున్న సంగీత ధోరణుల మధ్య అసలైన బతుకమ్మ పాటల స్వరూపం కనుమరుగవుతుందా? అనే ఆందోళన కూడా ఉంది. జానపద గేయాలకు డిమాండ్ పెరగడం అంటే వాటిని కేవలం వినోద వస్తువులుగా చూడటం కాదు. వాటి వెనుక ఉన్న పల్లె జీవితం, స్థానిక పదజాలం, ఆచారాలు, సంప్రదాయాలను కూడా కాపాడుకోవాలి. వృద్ధతరం నుంచి యువతరానికి ఈ పాటలు చేరేలా పాఠశాలలు, కళాశాలలు, సాంస్కృతిక సంస్థలు కార్యక్రమాలు నిర్వహించాలి. గ్రామాల్లో ఇంకా జీవించి ఉన్న జానపద కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలి. పాత బతుకమ్మ పాటలను సేకరించి భద్రపరచాలి. బతుకమ్మ చుట్టూ తిరిగే పాటలో తెలంగాణ మట్టి వాసన ఉంది. పూలలో ప్రకృతి ఉంది. ఆడపడుచుల గొంతులో ఆత్మీయత ఉంది. చప్పట్లలో సమష్టి జీవన స్ఫూర్తి ఉంది. అందుకే బతుకమ్మ ఆటలు మొదలైనప్పుడు పండుగ వాతావరణం ఏర్పడటమే కాదు.. తెలంగాణ జానపద సంస్కృతి మరోసారి తన ఉనికిని చాటుకుంటుంది. బతుకమ్మ పాటలు వినిపించాలి.. తెలంగాణ మట్టి గొంతుక వినిపించాలి. జానపద గేయాలకు డిమాండ్ పెరగాలి.. వాటి సొబగు, సొంతదనం తరతరాలకు నిలవాలి.

**- విద్యారాణి పూరడి**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.